



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక






సంపుటి: 3 సంచిక: 262, పేజీలు - 09

సోమవారం, జనవరి 1, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## 2023లో గెలుపు కిక్
## 2024లో అసలైన సవాళ్లు

### - కొత్త ఏడాది రాజకీయంగా సవాళ్లే



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కలిసి నవశకం నిర్మిస్తామంటూ భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇద్దరూ కలిసి దిగిన ఓ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీన్ని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అఫీషియల్ హ్యాండిల్ లోనే వేసుకున్నారు. దీన్ని చూసి కాంగ్రెస్ నేతలు వీరిద్దరూ కలిసి ఏదో చేస్తున్నారని గుసగుసలాడుకోవడం ప్రారంభించారు. బీఆర్ఎస్ నేతలు కూడా ఇలాంటి ప్రచారాలను ప్రారంభించారు. కాంగ్రెస్‌లో ఏదైనా జరగొచ్చని గతంలో జరిగిన అనేక పరిణామాలు నిరూపించాయి. 2023లో తెలంగాణ రాజకీయాలలో గుణాత్మక మార్పులు వచ్చాయి. 2024లో ఇంకా ఊహకు ఉందని కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇవి అంచనా వేయలేం. జరగబోయే రాజకీయ పరిణామాల్ని బట్టి రాజకీయ నేతల వ్యూహాలను బట్టి మారిపోయే అవకాశం ఉంది. వీటన్నింటికీ లోక్ సభ ఎన్నికలే వేదిక కానున్నాయి.

**2023లో పోరాడి విజయం సాధించిన కాంగ్రెస్**

తెలంగాణ రాజకీయాల్లో 2023 గుణాత్మక మార్పులు తీసుకు వచ్చింది. ఇలాంటి మార్పులు రావడం అసాధ్యమని అనుకున్న అనేక మందికి ప్రజాస్వామ్యంలో ఏదైనా సాధ్యమేనని నిరూపించింది. బాహుబలి వంటి నేతల్ని ఢీకొట్టే వారు లేరని చెప్పుకున్న మాటలు తప్పని తేలాయి. అయితే తెలంగాణ రాజకీయాల్లో ఈ మార్పులు రాత్రికి రాత్రి రాలేదు. అలాగని ఏకపక్షంగా ఎన్నికలు జరగలేదు. జనవరిలో ఉన్న వాతావరణం ఆగస్టుకు మారిపోయింది. డిసెంబర్‌కు పూర్తిగా ఏకపక్షమైపోయింది. ఈ రాజకీయ చదరంగంలో పావులు 6లో ▶

## అయోధ్య రాముడి కోసం భజనలు చేయండి

### - మన్‌కీ బాత్‌లో ప్రధాని



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఈ ఏడాదిలో చివరి మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో కీలక విషయాలు ప్రస్తావించారు ప్రధాని నరేంద్ర మోదీ. సంవత్సర కాలంలో భారత్ సాధించిన విజయాల్ని గుర్తు చేశారు. 2023లో ఆత్మనిర్భర భారత్‌కి అడుగులు పడ్డాయని వచ్చే ఏడాదిలోనూ ఈ ప్రయాణం కొనసాగాలని ఆకాంక్షించారు. దేశం అంతకంతకూ ఆత్మ విశ్వాసాన్ని పెంచుకుంటోందని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఫిట్ ఇండియా ఉద్యమం గురించీ ప్రస్తావించారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే అని అభిప్రాయపడ్డారు ప్రధాని. గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ రోజుకి కనీసం 7-8 గంటల పాటు 6లో ▶

## ఎంజీఎం ప్రక్షాళనపై ఫోకస్

### - అధికారులకు మంత్రి కొండా సురేఖ కీలక ఆదేశాలు



**హన్మకొండ (ప్రశ్న న్యూస్)** ఎంజీఎం పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలని వైద్య అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఉత్తర తెలంగాణ పెద్ద హాస్పిటల్ అయిన వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిని మంత్రి కొండా సురేఖ ఆదివారం సందర్శించారు. అనంతరం ఎంజీఎం అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. కరోనా కేసులు పెరగడం, రెండు రోజుల కిందట రెండు గంటల పాటు కరెంట్ పోయి రోగులు ఇబ్బందులు పడ్డ సంఘటన పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సంబంధించిన వివిధ అంశాలపై 6లో ▶

## జూబ్లీహిల్స్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** న్యూఇయర్ వేళ హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం సృష్టిస్తున్నాయి. డ్రగ్స్ ఫ్రీ సిటీగా హైదరాబాద్‌ను మార్చాలని పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా స్మగ్లర్లు డ్రగ్స్‌ను నగరానికి తీసుకొస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. అయితే హైదరాబాద్‌లో 6లో ▶

## 'రైతు - మహిళ - యువత నామ సంవత్సరం' గా సంకల్పం

### - సీఎం రేవంత్ న్యూఇయర్ విషెస్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ప్రజలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం 'రైతు - మహిళ - యువత నామ సంవత్సరం' గా సంకల్పం తీసుకున్నాం అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాం అన్నారు. నిర్బంధాలు, ఇనుప కంచెలను తొలగించి, 6లో ▶

## ఓ వైపు షర్మిల - మరోవైపు విపక్షాల ఐక్యత

### - అభ్యర్థుల మార్పుపై సీఎం జగన్ పునరాలోచన.?



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైఎస్ఆర్‌సీపీలో అభ్యర్థుల కసరత్తు జరుగుతోంది. డిసెంబర్ 31లోపు 50 మంది ఇంచార్జుల మార్పుతో రెండో జాబితా వస్తుందని వారంతా ఒకటో తేదీ నుంచి పెన్షన్ కానుక పంపిణీతో ప్రజల్లోకి వెళ్లడం ప్రారంభిస్తారని నాలుగు రోజులుగా చెబుతున్నారు. కానీ ఆ జాబితా మాత్రం విడుదల కాలేదు సరి కదా మెల్లగా పాత అభ్యర్థులకే టిక్కెట్లు ఖరారు చేస్తున్నట్లుగా సమాచారం ఇస్తున్నారు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దన్న సంకేతాలు పంపుతున్నారు. దీంతో వైఎస్ఆర్‌సీపీలో మళ్లీ యూటర్న్ నిర్ణయాలు జరుగుతున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. అభ్యర్థుల మార్పుపై సీఎం జగన్ పునరాలోచిస్తున్నారని మారుతున్న రాజకీయంతో పాటే వ్యూహాలను కూడా మార్చుకోవాలనుకుంటున్నారని అంటున్నారు.

**ఏపీలోకి షర్మిల ఎంట్రీ ఖాయం** 6లో ▶

## పీఎస్ఎల్వీ-సీ 58 కౌంట్ డౌన్ మొదలు

### - నేడే నింగిలోకి రాకెట్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ప్రయోగానికి సిద్ధమైంది. పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ ద్వారా ఎక్స్-రే పొలారిమీటర్ ఉపగ్రహాంని కక్ష్యలో ప్రవేశ పెట్టేందుకు రెడీ అయింది. ఈ ప్రయోగం కొత్త ఏడాది మొదటి రోజు అంటే 2024 నేడే జరుగుతుంది. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ ఇస్రో ఈ ప్రయోగం చేపడుతోంది. దీనికి సంబంధించి డిసెంబర్-31న కౌంట్ డౌన్ మొదలైంది.

**కౌంట్ డౌన్ మొదలు..**

ఎక్స్-రే పొలారిమీటర్ ఉపగ్రహ ప్రయోగానికి సంబంధించి ఆదివారం ఉదయం 8.10 గంటలకు కౌంట్ డౌన్ మొదలైంది. శనివారం రాకెట్ సన్నద్ధత, లాంచ్ ఆథరైజేషన్ సమావేశాలు ముగిశాయి. రాకెట్ అనుసంధానం, ఉపగ్రహ అమరిక, పరీక్షలు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు చర్చించారు. అనంతరం కౌంట్ డౌన్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆదివారం ఉదయం 8.10 గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. 25 6లో ▶

## రేషన్ కార్డుపై ప్రభుత్వం కీలక నిర్ణయం

### - జనవరి 31 చివరి తేదీగా ప్రకటన




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డు గురించి కీలక ప్రకటన చేసింది. రేషన్ కార్డు కేవైసీపై కొత్త అప్డేట్ ఇచ్చింది. రేషన్ కార్డుదారులు 2024 జనవరి 31వ తేదీలోగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఇప్పటికే చాలా మంది ఈకేవైసీ చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 6లో ▶

## ఎన్నికల కోడ్ వస్తే 6 గ్యారెంటీల పరిస్థితేంటి.?

### - కాంగ్రెస్ వి ఎగవేత పత్రాలని హరీష్ రావు విమర్శలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఈ లోపు పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తే వాటి పరిస్థితి ఏంటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మార్చి 17తో వంద రోజులు పూర్తవుతాయని, అప్పట్లోగా దరఖాస్తులు తీసుకుని ఎన్నికల వరకూ లాగుతారని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో మొత్తం 13 హామీలు అమల్లో ఉన్నాయని, ఇప్పటికీ 2 హామీలను మాత్రమే కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తోందని అన్నారు. 6 గ్యారెంటీల మార్గదర్శకాలపై ప్రజల్లో పలు అనుమానాలు ఉన్నాయని, 6లో ▶




## దేశంలో ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న కోవిడ్

### - 227 రోజుల తర్వాత పెద్ద సంఖ్యలో నమోదైన కేసులు
### - 178కి చేరిన కొత్తరకం సబ్- వేరియంట్ జేఎన్ 1



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో కరోనా మహమ్మారి విజృంభణ మరోసారి తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత రెండు వారాలుగా రోజువారీ కోవిడ్-19 కేసులు పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 800లకుపైగా కొత్త కేసులు నమోదుకాగా.. మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకూ కొత్తగా 841 కరోనా 6లో ▶

ప్రజాప్రశ్న
హైదరాబాద్, సోమవారం 1, జనవరి 2024

# నామినేటెడ్ పోస్టుల రేసులో తెలంగాణ బీసీ మహిళా సంఘం నేతలు

**- కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలను మహిళలకు అప్పగించాలని విజ్ఞప్తి - బీసీ మహిళలకు ప్రభుత్వ ఆదరణ కావాలన్న మణిమంజరి**

**- పథకాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ సర్కారు**





హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ )తెలంగాణలో కొత్తగా ప్రభుత్వం కొలువు దీరి నెల రోజులు పూర్తి అవుతోంది. అయితే కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాక , సంక్రాంతిలోగా 54 రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర 100కుపైగా నామినేటెడ్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది.
దీంతో ఈసారి బీసీ మహిళలకు కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా బీసీ మహిళలు పలు మార్లు తమకు ప్రభుత్వం నుంచి పెద్దగా గుర్తింపు రాలేదని, వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలను ఎవరు ఆదుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని వర్గాలకు ప్రాతినిథ్యం దక్కేలాగా సర్కారు పదవుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోనున్నట్లు సమాచారం.

### బీసీ మహిళలకు రాజ్యాధికారం ఏది : మణిమంజరి సాగర్

తెలంగాణలో అత్యంత వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు రాజకీయంగా ప్రాధాన్యమే లేదని బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణిమంజరి సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు.

### ఏళ్లుగా బీసీ మహిళల కోసం..

తాము ఎన్నో ఏళ్లుగా బీసీల కోసం , బీసీ మహిళల సంక్షేమం , అభివృద్ధి , చైతన్యం కోసం కృషి చేస్తున్నామని , ఈ మేరకు ప్రభుత్వం భర్తీ చేయబోయే నామినేటెడ్ పదవుల కోసం బీసీ మహిళా సంఘాలను భాగం చేయాలన్నారు. తమ సంఘానికి ప్రభుత్వం సహకరిస్తే రాష్ట్రంలోని బీసీలకు మరింత సేవ చేసే అవకాశం కలుగుతుందని చెప్పారు.త్వరలో జరగనున్న ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు పదవులు కేటాయించాలని కోరుతున్నారు.

# ఉంటే ఉండండి లేదంటే వెళ్లిపోండి

## - మంత్రి కొండా సురేఖ వర్సెస్ ఎమ్మెల్యే పల్లా




సిద్దపేట (ప్రశ్న న్యూస్) తెలంగాణ మంత్రి కొండా సురేఖ, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. సిద్దిపేటలోని హరిత హెూటల్లో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో కొమురవెల్లి మల్లన్న జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ నేతను స్టేజీ పైకి పిలిచారు. ఓడిపోయిన వారిని స్టేజీ మీదకి ఎలా పిలుస్తారంటూ అసహనం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పల్లా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### - ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అభ్యంతరం

కొమురవెల్లి జాతర ఏర్పాట్లపై హరిత హెూటల్లో ప్రభుత్వ అధికారిక సమీక్షలో కాంగ్రెస్ నేత కొమ్మూరిని స్టేజీపైకి పిలిచారు మంత్రి కొండా సురేఖ. అయితే దీనికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అభ్యంతరం చెప్పారు. ఇక్కడ జరుగుతున్నది కాంగ్రెస్ పార్టీ మీటింగ్ కాదని రాజకీయ వేదిక లాగా ఓడిపోయిన వారిని స్టేజీపైకి ఎలా పిలుస్తారంటూ ఎమ్మెల్యే పల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యే పల్లాకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా బీఆర్ఎస్ నేత వినలేదు. దాంతో విసుగు చెందిన కొండా సురేఖ మీరు ఉంటే ఉండండి, లేదంటే వెళ్ళిపొండి అని చెప్పేశారు. తన మాటలకు విలువ ఇవ్వడం లేదని, కాంగ్రెస్ పార్టీ సమావేశంలాగ ఓడిన వారిని స్టేజీపైకి ఎలా పిలుస్తారంటూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కొమరవెల్లి మల్లన్న జాతర సమీక్ష సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ గా మారాయి. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ పోరు మళ్లీ మొదలైందని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### - దోచుకునేందుకు కాంగ్రెస్ నేతలు

కొమురవెల్లి మల్లన్న నిధులను దోచుకునేందుకు కాంగ్రెస్ నేతలను పిలుస్తున్నారని పల్లా ఆరోపించారు. గత 30 ఏళ్లలో ఎన్నడూ హెూటల్ లో ఇలాంటి సమావేశం నిర్వహించలేదని, కాంగ్రెస్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని సమావేశాన్ని తాను బహిష్కరించినట్లు ఎమ్మెల్యే పల్లా చెప్పారు. బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. సమావేశంలో ఉండటం ఇష్టంలేకనే పల్లా వెళ్లిపోయారని పేర్కొన్నారు. జాతర ఏర్పాట్ల పనుల కోసం తాము ఎవరినైనా పిలుచుకునే అధికారం ఉంటుందన్నారు. కానీ పల్లా మాత్రం ప్రోటోకాల్ పేరు చెప్పి, సమావేశాన్ని బహిష్కరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏమైనా తప్పిదాలు జరిగితే కలెక్టర్ చెబుతారు కానీ, పల్లా మాత్రం ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేయాలని చూశారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరియు ఉమ్మడి జిల్లా జర్నలిస్టుల కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

## - యూత్ ఐకాన్ లీడర్ భువన్ కుమార్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )ఆంగ్ల నామ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు భువన్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.2024 ఏడాది ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. జిల్లాప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అభిలషించారు. కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని, ఎల్లవేళలా మంచి జరగాలనే ఆకాంక్ష వెలిబుచ్చారు.2023 లో ఎదురైన అనుభవాలను సానుకూలంగా మల్చుకుని, 2024 నూతన సంవత్సరంలో మరింత పట్టుదల, అవిరళ కృషితో విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కొత్త సంవత్సరంలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తూ జిల్లాను మరింత వడివడిగా ప్రగతి పథాన పయనింపజేసేందుకు కలిసికట్టుగా కృషిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి గెలుపునందించే సంవత్సరం కావాలని యూత్ ఐకాన్ లీడర్ అభిలషించారు.

# జిల్లా లో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

## జిల్లా ఇంచార్జ్ ఎస్పీ సిహెచ్. సింధు శర్మా



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )మెదక్ జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని (జనవరి 1వ తేది నుండి 07 వ తేదీ వరకు) పాటు జిల్లా వ్యాప్తం గా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని మెదక్ జిల్లా ఇంచార్జ్ ఎస్.పి. శ్రీమతి.సిహెచ్.సింధు శర్మా ఐ.పి.ఎస్ తెలిపినారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపినారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. హెచ్చరించారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపినారు.

# సావిత్రి భాయి 193వ జయంత్యుత్సవం పోస్టర్ రిలీజ్

**విడుదల చేసిన కమిటీ చైర్మన్ మణిమంజరి సాగర్**
**హాజరైన బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల**
**జనవరి 3న ఉదయం 10కి రవీంద్రభారతిలో జయంతి సంబురాలు**
**వేలాదిగా బీసీ మహిళలు తరలిరావాలని పిలుపు**



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ ) దేశంలోనే ప్రప్రథమ అధ్యపకురాలు, ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రి భాయి 193వ జయంత్యుత్సవాలను జనవరి 3న రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సావిత్రి భాయి పూలే ఉత్సవ కమిటీ చైర్మన్ మణిమంజరి సాగర్ తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వమే , భారతదేశంలో ఉన్న వివక్షతను, అగ్రవర్ణ పోకడలను ఎదుర్కొని బీసీ మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయురాలిని వేలాది మహిళల సాక్షిగా స్మరించుకుంటూ, మహిళా సంక్షేమం , అభివృద్ధి , రాజకీయ సాధికారత కోసం కృషి చేస్తామన్నారు. ఈ ఉత్సవానికి బీసీ మహిళలు వేలాదిగా తరలిరావాలి అని మణిమంజరి సూచించారు. కార్యక్రమంలో సావిత్రి భాయి పూలే కమిటీ సభ్యులు సంధ్యారాణి పద్మశ్రీ రేణుక దీటి దేవిక వాణి లావణ్య విజయలక్ష్మి రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ధర్పల్లి మల్లన్న జాతర వైభవంగా నిర్వహించిన యాదవ సంఘం



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో మల్లన్న జాతర గత పది సంవత్సరాలు నుండి నిర్వహిస్తున్నారు. ఏటేటా భక్తుల సంఖ్య పెరిగి సందడిగా మారుతుంది ప్రతి సంవత్సరం జరపబడుతుంది భక్తులు కోరిన కోరికలు తీర్చేవారు. ధర్పల్లి మల్లన్న కాబట్టి ఇక్కడికి వచ్చే భక్తులు మొదట రెండు కొబ్బరికాయలు కొట్టి తమకు ఏమైతే కోరిక ఉందో అది అక్కడ మనసులో అనుకుంటే వచ్చే సంవత్సరం వరకు ఆ కోరిక తీరుతుంది బాధలనుంచి విముక్తి పొందుతున్న భక్తులు ఇంతితై వటుడింతై అన్నట్టుగా భక్తుల సంఖ్య పెరుగుతుంది సంతానం లేని వారికి సంతానం ఇంకా ఆడపిల్ల కావాల్నా మగపిల్లలు కావాల్నా అని మనసులో కోరుకుంటే తప్పకుండా తీరుతుందని భక్తులు అంటున్నారు. ఇలాంటి మల్లన్న జాతర జరుగుతా ఉంది ఇంకా అభివృద్ధి చెందుతారని జిల్లాలో లోనే జాతరలో పెరుగుతున్న భక్తుల సంఖ్య అందుకే మల్లన్న జాతర ప్రతి సంవత్సరం కొలుస్తున్నామని అక్కడి నిర్వాహకులు అన్నారు. ఈ కార్యక్రమంలో జీర్రా మహిపాల్ యాదవ్, పాలెం రాజేశ్వర్ జీర్రా రాజు, నరేష్, భూమన్న, మల్లన్న, రాజమల్లు, రాజు, రంజిత్, వెంకట్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ- విద్యార్థినిపై లైంగిక దాడి.. ముగ్గురు నిందితుల అరెస్ట్



బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ) క్యాంప్ పరిధిలో ఐఐటీ మహిళా విద్యార్థిపై లైంగిక దాడి కేసుతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వారణాసి పోలీసులు ఆదివారం తెలిపారు. అనుమానితులను కునాల్ పాండే, ఆనంద్ అలియాస్ అభిషేక్ చౌహాన్, సాక్షం పటేల్‌గా గుర్తించినట్లు లంక పోలీస్ స్టేషన్ ఇన్ చార్జి అధికారి శివకాంత్ మిశ్రా తెలిపారు.నవంబర్ ఒకటో తేదీ అర్ధరాత్రి సదరు బాధితురాలిపై అనుమానితులు లైంగిక దాడి చేశారని చెబుతున్నారు. తన స్నేహితుడితో హాస్టల్ నుంచి బయటకు వెళ్లినప్పుడు ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లారని విద్యార్థిని తన ఫిర్యాదులో తెలిపింది. తన స్నేహితుడిని తప్పించేందుకు తనను చుట్టుముట్టారని ఆమె ఆరోపించింది. బాధితురాలిని వివస్త్రను చేసి ఫోటోలు, వీడియో చిత్రీకరించారని ఆరోపించింది. 15 నిమిషాల తర్వాత తన ఫోన్ నంబర్ తీసుకుని, వదిలి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐపీసీ 354 సెక్షన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

# నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి

## : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి ( హైదరాబాద్ ) : ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ( %మీూా ాఖఇఊఖ తీవఎఎఎ% ) పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివసాయినగర్‌లో నూతన కాలనీ సంక్షేమ సంఘం ప్రమాణస్వీకారోత్సవం అనంతరం ఆయన మాట్లాడారు. కాలనీవాసుల భాగస్వామ్యంతో ఆదర్శ నియోజకవర్గంగా (%వీశీసవశ్రీ ఎశీఅర్ఓబవఅఎఎ%) తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. కాలనీలల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో ఫ్లైట్ టికెట్లు బుక్ చేస్తూ రూ. 4.4 లక్షలు పోగొట్టుకున్న మహిళ

ముంబై : దేశవ్యాప్తంగా గత ఏడాది కాలంగా సైబర్ నేరగాళ్లు ఓ రేంజ్‌లో రెచ్చిపోతున్నారు. రోజుకో తరహా స్కామ్‌తో ఆన్‌లైన్ అడ్డాగా బాధితులను నిండా ముంచుతున్నారు. ఇక లేటెస్ట్‌గా ముంబైకి చెందిన మహిళ దుబాయ్‌కు విమాన టికెట్లు బుక్ చేసే క్రమంలో స్కామర్ల బారినపడి ఏకంగా రూ. 4.4 లక్షలు పోగొట్టుకున్నారు. ప్రముఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్స్ బుక్ చేసేందుకు ప్రయత్నిస్తూ స్కామర్ల చేతిలో ఆమె మోసపోయారు. స్కామర్లు మోసపూరితంగా టికెట్ బుకింగ్ ప్లాట్‌పాం కాంటాక్ట్ నెంబర్ స్థానంలో తమ నెంబర్లు రీప్లేస్ చేసి ఈ స్కామ్‌కు స్కెచ్ వేశారు. ముంబై జుహు ప్రాంతానికి చెందిన 64 ఏండ్ల గీతా షెనాయ్ ఆన్‌లైన్ టికెట్ ఎంక్వయిరీ కోసం ప్రముఖ వెబ్‌సైట్‌ను సంప్రదించగా అందులో ఉన్న ఫోన్ నెంబర్ ప్రకారం సంస్థ ప్రతినిధితో మాట్లాడగా సదరు ప్రతినిధి ఆమెను తన ఫోన్‌లో ఎనీ డెస్క్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు.అతడి సూచనలకు అనుగుణంగా ఆమె యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోగా డివైజ్‌ను కంట్రోల్‌లోకి తీసుకున్న స్కామర్ ఆమె ఫోన్ యాక్సెస్ తీసుకుని స్కామ్‌కు తెరలేపాడు. ఆపై ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ. 4.4 లక్షలను తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. తన ఖాతా నుంచి రూ. 4.4 లక్షల విలువైన అనధికార లావాదేవీలు జరిగినట్టు గుర్తించిన మహిళ మోసపోయానని గ్రహించి జుహు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# రాత్రికి రాత్రే చెరువు చోరీ..

## పూడ్చేసి గుడిసె నిర్మించిన ల్యాండ్ మాఫియా

పాట్నా: చేపల పెంపకం, నీటి వసతి కోసం వినియోగిస్తున్న చెరువును రాత్రికి రాత్రే చోరీ చేశారు. దానిని మట్టితో పూడ్చివేశారు. అక్కడ ఒక గుడిసెను నిర్మించారు. ల్యాండ్ మాఫియా చెరువును మాయం చేయడంపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీహార్‌లోని దర్భంగా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. దర్భంగాలోని ప్రభుత్వ చెరువు రాత్రికి రాత్రే మాయమైంది. ల్యాండ్ మాఫియా గత కొన్ని రోజులుగా రాత్రివేళ గుట్టుగా ఇసుక, మట్టితో దీనిని పూడ్చివేశారు. చివరకు పూర్తిగా కనుమరుగైన చెరువు స్థానంలో ఒక గుడిసెను నిర్మించారు. కాగా, చెరువు పూర్తిగా మాయం కావడాన్ని స్థానికులు గమనించారు. దీని గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చెరువు చోరీ గురించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చెరువును పూడ్చి కబ్జా చేసింది ఎవర్నదని ఆరా తీస్తున్నారు. బీహార్‌లో ఇప్పటికే ఇనుప వంతెన, తారు రోడ్డులో కొంత భాగం, టెలిఫోన్ టవర్ వంటివి చోరీ అయ్యాయి. ఇలాంటి అసాధారణ చోరీల సరసన తాజాగా చెరువు కూడా చేరింది.

# ఇవి తరచుగా తింటే ప్లేట్‌లెట్స్ కౌంట్ పెరుగుతుంది! అంతేకాదు..

పాలకూర, బచ్చలికూర వంటి ఆకుకూరలు, దానిమ్మ పండ్లు, డ్రై ఫ్రూట్స్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు మీకోసం.. పాలకూర, బచ్చలి కూర తింటే పాలకూర, బచ్చలికూర లాంటి ఆకు కూరలు మీ కంటి చూపును మెరుగుపరుస్తాయి. పాలకూరలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు, యాంటీ ఆక్సిడెంట్లు కంటి సమస్యలపై పోరాడటంతో ప్రముఖపాత్ర పోషిస్తాయి. ఆకుకూరలు.. మాక్యులర్ డీజెనరేషన్, కంటిశుక్లం లాంటి సమస్యల నుంచి రక్షించి కార్నియాను ఆరోగ్యంగా ఉంచుతాయి.



### దానిమ్మ


దానిమ్మ తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. రక్తహీనతతో బాధపడేవారిని దానిమ్మ తినమని సలహా ఇస్తారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ రోగ నిరోధక శక్తికి పెంచుతాయి.

అంతేనా దానిమ్మని రెగ్యులర్‌గా తింటే ప్లేట్‌లెట్స్ కౌంట్ పెరుగుతుందని ఓ పరిశోధనలో తేలింది. కాబట్టి ప్లేట్‌లెట్స్‌ని పెంచుకునేందుకు దానిమ్మ బాగా ఉపయోగపడుతుంది.

### డ్రై ఫ్రూట్స్

డ్రై ఫ్రూట్స్... శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను బలంగా మారుస్తాయి. దీంతోపాటు కంటిచూపును మెరుగు పర్చి నేత్ర సంబంధ సమస్యలను దూరం చేస్తాయి. వీటి లో విటమిన్ ఇ, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి.

# ఇవి మామూలు టొమాటోలు కావు.. బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు



టొమాటోలు సహజసిద్ధంగానే కొన్ని పోషకాలను కలిగి ఉంటాయి. టొమాటోల్లోని పోషకాలు మరింత సమర్థంగా పనిచేసేలా బ్రిటిష్ శాస్త్రవేత్తలు జన్యుమార్పిడి ద్వారా రూపొందించారు. జన్యుమార్పిడి ద్వారా పండించిన ఈ టొమాటోలను వారు 'సూపర్ టొమాటోలు' అని అంటున్నారు. ఈ సూపర్ టొమాటోల విశేషమేమిటంటే, వీటిలో కోడిగుడ్ల కంటే రెట్టింపు స్థాయిలో విటమిన్ డి3 ఉంటుంది. సాధారణ టొమాటోల్లో ఉండే 'ప్రో విటమిన్' కొంత కొలెస్ట్రాల్‌గా రూపాంతరం చెందుతుంది. 'సీఆర్ఐఎస్‌పీఆర్' అనే జీన్ ఎడిటింగ్ పద్ధతిలో, 'ప్రో విటమిన్' కొలెస్ట్రాల్‌గా రూపాంతరం చెందేలా చేసే జన్యువులో మార్పు తీసుకొచ్చారు. ఫలితంగా 'ప్రోవిటమిన్' మరింత విటమిన్ డి3గా మారేలా చేశారు. నార్విచ్‌లోని జాన్ ఇన్నెస్ సెంటర్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఈ అద్భుతాన్ని సాధించారు. విటమిన్ డి3 పుష్కలంగా ఉండే ఈ టొమాటోలు డెమెన్షియా, పార్కిన్‌సన్, కేన్సర్ వంటి వ్యాధులను సమర్థంగా నివారించగలవని వారు చెబుతున్నారు.

# ప్లేట్‌లో ఈ కలర్ పండ్లు, కూరగాయలుంటే ఆరోగ్యం మీ వెంటే!!

రోజుకు ఐదురకాల పండ్లు లేదా కూరగాయలు తినడం ఆరోగ్యానికి చాలామంది. అయితే, ఆరోగ్యకర ఆహారం అంటే ఎక్కువ పండ్లు, కూరగాయలు తీసుకోవడం కాదు.. వేటిని తీసుకుంటారనేది ముఖ్యమని అంటున్నారు నిపుణులు. ఇందుకోసం రెయిన్ బో డైట్ ప్లాన్‌ను సూచిస్తున్నారు. ప్లేటులో ఇంద్రధనుస్సు రంగుల్లా పండ్లు, కూరగాయలు ఉండాలని అంటున్నారు. అలా రంగురంగుల్లో ప్లేట్ ఉంటే ఉత్సాహంగా తినగలమని చెబుతున్నారు. ఆకుపచ్చ, ఎరుపు, ఊదా, పసుపు, నారింజలాంటి వివిధ రంగుల పండ్లు, కూరగాయలు ప్లేట్‌లో ఉండాలని నిపుణులు అంటున్నారు. ఇందులో మన శరీరానికి కావాల్సినంత వైవిధ్యమైన పోషకాలు, విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఈ రెయిన్ బో డైట్ వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మన శరీరానికి క్యాన్సర్‌తో పోరాడే శక్తి లభిస్తుంది.



1. ఎరుపు

ఎరుపు రంగు పండ్లు, కూరగాయల్లో ఆంథోసైనిన్స్ అనే పిగ్మెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. దానిమ్మ, ఎర్ర మిరియాలు, స్ట్రాబెర్రీలు, టొమాటోలు రోజులో కచ్చితంగా తీసుకోవాలి. ఇవి చర్మానికి మేలు చేస్తాయి. మధుమేహం వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి స్ట్రోక్, గుండె జబ్బులు రాకుండా రక్షిస్తాయి.

2. నారింజ, పసుపు

నారింజ, పసుపు రంగు పండ్లు, కూరగాయల్లో కెరోటినాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. క్యారెట్, నిమ్మకాయలు, నారింజ, మామిడి, చిలగడదుంపలను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కళ్లకు ప్రయోజనకరమైనవి. చర్మానికి ఆరోగ్యకరమైనవి. కీళ్ల ఆరోగ్యానికి ఇవి సహాయపడతాయి.



3. ఆకుపచ్చ

ఆకు కూరల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. వీటిని రోజూ ఆహారంలో చేర్చుకోవాలి. బ్రొకోలీ, బ్రస్సెల్స్‌లో విటమిన్ ఏ అధికంగా ఉంటుంది. కివీ పండ్లు, గ్రీన్‌బెల్ పెప్పర్స్‌లో విటమిన్ సీ ఎక్కువగా ఉంటుంది. ఆహారంలో రోజూ వీటిని చేర్చుకోవడం వల్ల శరీరం మొత్తం క్లీన్ అవుతుంది. కణజాల మరమ్మతులో ఇవి సహాయపడుతాయి. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

4. నీలం, ఊదా రంగు

నీలం, ఉదారంగు పండ్లు, కూరగాయల్లో ఫైటో న్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. బ్లాక్ బెర్రీస్, రేగు పండ్లు, బ్లూ బెర్రీస్, రెడ్ క్యాబేజీ, వంకాయలు ఆరోగ్యానికి మంచివి. మూత్రనాళం ఆరోగ్యానికి సహాయపడతాయి. శరీరంలో వాపులను తగ్గిస్తాయి. జ్ఞాపకశక్తి కోల్పోయే అవకాశాన్ని తగ్గిస్తాయి.



5. బ్రౌన్ రంగు

బ్రౌన్ రంగు పండ్లు, కూరగాయల్లో ఫైబర అధికంగా ఉంటుంది. గోధుమరంగు తాజా పండ్లు, గింజలు, తృణధాన్యాలను ప్రతిరోజూ తప్పక తీసుకోవాలి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తాయి. పేగు కదలికలను నియంత్రిస్తాయి. కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుతాయి. జీర్ణక్రియ సాఫీగా ఉండేలా చూస్తాయి. బరువు నిర్వహణలో సహాయపడతాయి.



# చలిలో అనారోగ్యం... నెయ్యితో వైద్యం

ప్రస్తుతం వ్యాధి నిరోధక సామర్థ్యం / ఇమ్యూనిటీ మీద సర్వత్రా అవగాహన పెరిగిన నేపథ్యంలో నెయ్యి అనేది ఒక సహజమైన ఇమ్యూనిటీ బూస్టర్‌గా ఆహార నిపుణులు సిథ్స్‌ఫార్మ్ నిర్వాహకులు కిషోర్ ఇందుకూరి అభివర్ణిస్తున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ తో పాటు ఇతర పలు సంస్థలు కూడా నెయ్యి అందించే ఆరోగ్య లాభాలను ధృవీకరించిన నేపథ్యంలో నెయ్యి వినియోగం వల్ల కలిగే పలు ప్రయోజనాలు ఆయన వివరించారిలా..దేశీ నెయ్యి యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. తద్వారా వింటర్ సీజన్‌లో విభిన్న రకాల వైరస్‌లను అడ్డుకుని ఫ్లూ, దగ్గు, జలుబుల నుంచి రక్షిస్తుంది. ఆయుర్వేద గ్రంథాల ప్రకారం... దేహంలోని అంతర్గత ఉష్ణాన్ని క్రమబద్ధీకరించి ఉంచేందుకు నెయ్యి సహకరిస్తుంది. అందువల్లే దీనిని చలికాలపు వంటకాలు, గజర్ కా హల్వా, మూంగ్ దాల్ హల్వా తదితర మిఠాయిల్లో ఎక్కువ వినియోగిస్తారు. శీతాకాలంలో ప్రధాన పండగలు రావడం, ఆ సమయంలో దీపాలను సైతం నెయ్యి తో వెలిగించడం వెనుక అంతరార్థం ఇదే. అలాగే పిండివంటలు వండుకోవడం సర్వ సాధారణం. గారెలు, బూరెలు, అరిసెలు...మరేవైనా సరే వాటి తయారీలో ఆయిల్ వినియోగం తప్పనిసరి. అయితే వీలైనంత వరకూ పిండి వంటలు నెయ్యితో వండడం శ్రేష్టమంటున్నారు నిపుణులు సంప్రదాయంగా మన భారతదేశ వంటల విధానంలో నెయ్యి ఒక తప్పనిసరి ముడి సరుకు. మరీ ముఖ్యంగా శాఖాహార వంటలకు సంబంధించి అటు రుచిని ఇటు ఆరోగ్యాన్ని పెంచేందుకు నెయ్యి తప్పనిసరిగా వినియోగించేవారు. అయితే రిఫైండ్ ఆయిల్స్‌తో నెయ్యిని మేళవించడం అనేది ఆధునికులు చేస్తున్న అతిపెద్ద పొరపాటని పోషకాహార నిపుణుల మాట. పుష్కలంగా నీరుతో పాటు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా నెయ్యిలో పుష్కలంగా ఉంటాయి. తద్వారా వ్యాధి నిరోధకత పెంపొందుతుంది. శరీరం కొవ్వును గ్రహించడంలో నెయ్యి సహకరిస్తుంది. బరువు తగ్గించే మార్గాల్లో నెయ్యి వాడకం కూడా ఒకటని నవతరం వైద్యులు చెబుతున్నారు. నెయ్యిలో శరీరానికి అవసరమైన, కొవ్వును కరిగించే ద్రవపదార్థాలు, శరీర ధర్మాల్ని నిర్వర్తించడంలో సహకరించే డి,కె,ఇ,ఇ విటమిన్స్ ఉంటాయి. దీనిలో బ్యుటిరిక్ యాసిడ్ ఉంటుంది. దీనిని పెద్ద పేగు కణాలు శక్తి కారకంగా ఉపయోగించుకుంటాయి. హార్మోన్ల సమతుల్యాన్ని కాపాడడంలో నెయ్యి కీలక పాత్ర పోషిస్తుంది. ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్‌ను కాపాడుతుంది. కణాల విధులను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ రాకను నెయ్యిలోని అధిక వేడి గుణం అడ్డుకుంటుంది. పరగడుపున ఉదయం పూట నెయ్యిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కణాల పునరుజ్జీవన ప్రక్రియను అది బలోపేతం చేస్తుంది.



# శతక నీతి సుమతి అద్దం... అబద్ధం

'బలవంతుడనాకేమని పలువురితో నిగ్రహించి పలుకు టమేలా/బలవంతమైన సర్పము చలిచీమల చేతి చిక్కి చావదే సుమతీ !' అన్న సుమతీ శతకకారుడి నీతి సూత్రాన్ని చర్చించుకుంటున్నాం... నిజానికి ఏ కాలానికి ఆ కాలంలో పెద్దలు పిల్లలను మంచి మార్గంలో పెట్టడానికి ఇటువంటి హితోక్తులు చాలా చెబుతుంటారు. వాటిని విని అనుసరించిన వారు విచక్షణతో, వివేకంతో వారి జీవితాలను సుఖమయం చేసుకుంటుంటారు. నందుల చరిత్ర తెలిసే ఉంటుంది. కేవలం పొగరుబోతు తనంతో, అతిశయంతో నిష్కారణంగా వైరం పెట్టుకొని మలయకేతు, పర్వతకుడు, వైరోచకుడు..ఇలా ఎంతో మంది రాజులను అవమానించారు. ఆ క్రమంలోనే అన్నశాలలోకి అన్నం తినడానికి కూర్చొన్న చాణక్యుడిని అవమానకరంగా మాట్లాడారు. ఆయన చాలా గొప్పవాడు, మహావిద్వాంసుడు, మహా మేధావి అంటూ అందరూ చెబుతున్నా వినకుండా జుట్టుపట్టి ఈడ్పించారు నందులు. పిలక ఊడిపోయింది.. మిమ్మల్ని పదవీచ్యుతుడిని చేసేదాకా ఈ పిలక ముడి వేయను.. అని అక్కడే శపథం చేసాడు చాణక్యుడు. చంద్రగుప్తుణ్ణి ముందు నిలబెట్టి నందుల చేతిలో అవమానం పొందిన రాజులందరినీ ఏకం చేసిన చాణక్యుడు వ్యూహరచన చేసిన యుద్ధంలో ఇంత గొప్ప నందులు ఏమయిపోయారు. మొత్తం వంశమే మిగలకుండా పోయింది. నందుల మీద అపార ప్రేమ కలిగిన మహా మేధావి ఒకాయన ఉండేవాడు. ఆయన పేరు రాక్షసుడు. చాణక్యుడికి ప్రతిభకు లొంగిపోయి చంద్రగుప్తుడికి ప్రధానమంత్రి అయ్యాడు. చంద్రగుప్తుడు తన అభిరుచి మేరకు ఒక రాజభవనం కట్టించుకున్నాడు. మొత్తం సిద్ధమయిన తరువాత దానిలో ఉండడానికి చాణక్యుడి అనుమతి కోరాడు. 'వీల్లేదు' అని శాసించాడు రాజగురువు. చంద్రగుప్తుడు చిన్నాచితకా రాజేమీ కాదు... అప్పట్లో భారత దేశంలో వైభవంగా వెలిగిన మగధ సామ్రాజ్యాధిపతి. అంత గొప్ప రాజ్యానికి తిరుగులేని మహారాజయి ఉండి తను ఇష్టపడి కట్టించుకున్న ఇంట్లోకి పోవడానికి అనుమతి అడగడం, దాన్ని చాణక్యుడు తిరస్కరించిన వెంటనే సమ్మతించడం... సాధారణ విషయమేమీ కాదు. వినయం అంటే అదీ. చెప్పినంత సులువు కాదు అలా ఉండడం.


## ఆహార భద్రత...అందరి వ్యవహారం

తిండి కలిగితే కండ కలదోయ్ అని మహాకవి గురుజాడ అప్పారావు చాలా తేలికగా చెప్పేశారు గానీ.. ఈ కాలంలో తిండి ఒక్కదానితోనే కండలు వచ్చేయవు. ఆ కండలతో కలిసి ఆరోగ్యమూ సమకూరాల ంటే.. ఏం తింటున్నాం? ఎలా తింటున్నాం? ఎప్పుడు.. ఎక్కడ తింటున్నామన్నదీ ముఖ్యం. అవగాహన లోపం కొంత.. కాలుష్యం మరికొంత కలిసి.. ఆహారం కారణంగా కొన్ని అనారోగ్య సమస్యలను తెలియకుండానే చవిచూస్తున్నాం.

ఆహార భద్రత... అందరి వ్యవహారం : ఆహార భద్రత దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ 2019లో మొదలుపెట్టింది. తినే తిండి వల్ల కలిగే నష్టాలపై, రాగల ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, తద్వారా మానవ ఆరోగ్యానికి, ఆహార భద్రతకు, ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయానికి, పర్యాటకానికి సాయపడటం లక్ష్యం. గతేడాది అడిస్ అబాబా, జెనీవాలో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో 'ఆహార భద్రత–భవిష్యత్తు' అనే అంశంపై చర్చలు జరిగాయి. మేలైన ఆహారం తగినంత అందరికీ లభించడం వెనుక సామాజిక ఆర్థిక కారణాలు ఉండవచ్చుగానీ, దీని ప్రభావం మాత్రం అందరిపై ఉంటుందని డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేస్తోంది. అందుకే ఈ ఏడాది 'ఆహార భద్రత.. అందరి వ్యవహారం' అనే ఇతివృత్తంతో కార్యక్రమాలను రూపొందించింది. మనం తినే ఆహారం సురక్షితంగా ఉండేందుకు, మన ఆరోగ్యాన్ని పాడుచేయకుండా ఉండేందుకు పొలంలోని రైతు మొదలుకొని, విధానాలు రూపొందించే ప్రభుత్వాధినేతల వరకూ ప్రతి ఒక్కరు తమదైన పాత్ర పోషించాలని డబ్ల్యూహెచ్ఓ చెబుతోంది. ఫలితంగా కలుషిత ఆహారం తినడం వల్ల వచ్చే వ్యాధుల భారం తగ్గి సమాజం అభివృద్ధి చెందుతుందని అంచనా.

# మంచి మాట: సాధన.. ఓ తపస్సు

ఏ విద్యలోనైనా పట్టు రావాలంటే సాధన అవసరం. అది నిరంతరం కొనసాగాలి. 'అభ్యాసం కూసు విద్య..' అన్నారు కదా పెద్దలు. అభ్యసించటానికి శ్రద్ధాసక్తులే కాక అకుంఠిత దీక్ష కావాలి. దానికి పట్టుదల కలవాలి. ఇష్టపడి నేర్చుకున్న ఒక విద్యను అభ్యసించవలసి వుంటుంది. ఆ విద్యను సరిగా ఒక గురువు వద్ద నేర్చుకోవాలి. సుశిక్షితులైన పిదప నేర్చిన విద్యను అభ్యసించాలి. అపుడే దానికొక దిశ దశ ఏర్పడతాయి. సక్రమ మార్గం ఏర్పడుతుంది. నేర్చుకున్న విద్య కరతలామలకమవ్వాలంటే అభ్యాసం వల్లే సాధ్యం. సరైన శిక్షణ లేని విద్య సాధన చేయటం సమయం వృథా. ఇక్కడ జాగరూకత చాలా అవసరం. తపస్సుకు మనో నిశ్చలత అత్యంత ప్రధానమైనది. ఒక దైవాన్ని మనస్సు లో ప్రతిష్టించుకోవాలి. ఆ దేవుడి నామాన్నో.. మంత్రాన్నో ఉచ్చరిస్తూ వుండాలి. జగాన్ని మరవాలి. పెదవుల కదలికలు నెమ్మది.. నెమ్మదిగా అదృశ్యమై మీ ఉచ్ఛ్వాస,.. నిశ్వాసాలే ఆ నామ, మంత్రాలవుతాయి. ఇది తపస్సులో గొప్ప దశ. ఆ అద్భుత స్థితికి చేరగలిగామా.. తపస్సులో అత్యున్నత దశకు చేరుకున్నట్టే. సాధనలో కూడ అంతటి త్రికరణ శుద్ధి కావాలి. అపుడే మనం అభ్యసిస్తున్నా దానిలో గొప్ప ప్రావీణ్యం పొందుతాం. ఎలాగూ మన మనస్సుకు నచ్చిన విద్యను ఎంపిక చేసుకుంటాం కనుక ఆమూలాగ్రంగా నేర్చుకోవాలి. ఏకాగ్రతతో సాధన చేయాలి. మన శక్తియుక్తుల్ని ధారపోయాలి. సంకల్పం... పట్టుదల..మనోనిశ్చలత.. ఏకాగ్రత.. ఈ శక్తుల పిల్ల కాలువలన్నీ సాధన అనే మహా నదిగా మారిన వేళ.. మార్చుకున్న వారికి విద్య స్వాధీనమై.. విద్వత్తు వశమవదా..!సా.. ధ.. న అనే మూడు అక్షరాల వెనుక ఇన్ని శక్తుల కలయిక ఉందని.. ఉంటుందని గ్రహించాలి. అలా గ్రహించిన వారే వాటిని తమలో అంతర్గతంగా వుంటే గుర్తిస్తారు. లేకుంటే అలవరచుకుంటారు. అటువంటి వారే ఆ సాధనా తపస్సులో పరిపూర్ణులవుతారు. ఆ తపోఫలితాన్ని పొందుతారు. సాధారణంగా ఎవరైనా.. నేర్చుకున్న విద్యను సాధన చేస్తారు. ఇది లోకరీతి. గురువు చెప్పిన విద్యను దాని లోతుపాతులను క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే బాగా అభ్యసించాలి. జీవితంతో పోల్చి చూసుకోవాలి. స్వీయ అనుభవాలు, ఇతరుల అనుభవాలు పరిశీలించాలి. ఆ సాధనకు విచక్షణ,వివేచనల తోడు చేసి మరింతగా గట్టిపరచుకోవాలి. కొందరికి అద్భుత ప్రతిభా వ్యుత్పత్తులుంటాయి. వారి వైఖరే వేరు. అసలు గురువునుండి విద్యను గ్రహించి ఆకళింపు చేసుకునే పద్ధతే విభిన్నం. కౌరవులకు .. పాండవులకు విలువిద్య నేర్పే ఆరంభ దశలోనే.. బాణంతో చేధించవలసిన పక్షికన్ను తప్ప ఇంకేమి కనుపించటంలేదన్న అర్జునుడి మాటలతో అతనే ఆ విద్యకు సరైన అర్హుడని



నిర్ణయించుకున్నాడు ద్రోణాచార్యుడు. గొప్ప కలయిక వారిరువురిది. ఏకాగ్రతతో గురువు చెప్పిన విద్యను సాధన చేయసాగాడు. ఓ రాత్రివేళ.. దీపంలేని తరుణాన... భోజనం చేయగలిగిన పార్థుడు ఒక అద్భుతమైన ఆలోచన చేశాడు. చీకటిలో శబ్దాన్ని బట్టి.. ఆ దిశ వైపు బాణం వేసి వేటాడటం నేర్చుకున్నాడు. గొప్పగా సాధన చేసాడు. పట్టు సంపాదించాడు. తన గురువు మెప్పు పొందాడు. గురువు నేర్పిన విద్యను సాధన చేసే క్రమంలో వచ్చే ఆలోచనలకు తన అద్భుత ఊహాశక్తిని మేళవించి తాను నేర్చిన.. నేర్చుకుంటున్న విద్యకు ఒక రూపు.. కోణం.. ఓ వైవిధ్యతను.. ఓ విభిన్నతను కలిపి ఆ విద్యను పరివ్యాపితం చేసాడు తన శక్తి యుక్తులతో. తన గురు ప్రశంస పొందాడు. అలా విశేషమైన ప్రతిభ కల శిష్యులుంటారు. ప్రతిభకు వైవిధ్యం తోడైతే అది ఓ అద్భుతమే. అంతే కాదు.. ఓ నవ నవోన్మేషమే అవుతుంది. విశ్వనాథ సత్యనారాయణ, మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభృతులు అటువంటి ప్రతిభ సంపన్నులే. నిరంతర సాధన మన సామర్థ్యాన్ని పెంచుతుంది. ఎనలేని ఆత్మ విశ్వాసాన్నిస్తుంది. పొరపాట్లు.. తప్పిదాలను గమనించి వాటిని సరిదిద్దుకునే అవకాశమిస్తుంది. విద్యాప్రతిభను ప్రదర్శించే సందర్భాలు నల్లేరు మీద బండిలా సాగాలంటే అభ్యాసం తప్పదు. భూ గర్భంలోని రత్నం వంటిదే ప్రతిభ. రత్నాన్ని వెలికితీసి సానపెడితే కాని ధగధగద్ధాయమానంగా ప్రకాశించదు. మనలోని పాడగలిగే గొంతుకకైనా.. అద్భుత కవితాశక్తికైనా... చిత్రలేఖనా ప్రతిభకైనా మార్గదర్శకత్వం చేయగల గొప్పగురువు కావాలి. ఆయన నుండి పొందిన మన జ్ఞానానికొక పరిపుష్టి.. పరిపూర్ణత.. అద్భుత స్వాధీనత.. రాణింపు రావాలంటే సాధన కావాలి. ఒక విద్వాంసుడి.. లేదా ఒక కళాకారుడి ప్రతిభ నిజానికి పేరు ప్రఖ్యాతులు ఎంత బాగా వస్తే వారు అంత ఎక్కువగా సాధన చేయాలి. ఒక కళాకారుడు అత్యున్నత స్థాయికి చేరిన తరువాత అతని ప్రదర్శన తిలకించటానికి వచ్చేప్రేక్షకులు అది అత్యున్నతంగా ఉండాలని... ఉంటుందని ఆశించి వస్తారు. అది ఎంతో సహజమైనది. తాను ఎప్పుడూ ఇస్తున్న ప్రదర్శనే కదా.. సాధన ఎందుకు చేయాలన్న ఆలోచన ఏ కళాకారుడికైనా.. పండితుడికైనా వచ్చిన క్షణం అతడి ప్రతిభాభానుడికి మేఘాలు కమ్ముతాయి.

కళాకారులు ఎంతటి లోకప్రసిద్ధులైతే అంతటి సాధన కావాలి. చేయాలి. వారి స్థాయికి తగ్గని ప్రదర్శన ఇవ్వాలి. అలా ఇవ్వాలంటే సాధన చేయక తప్పదు. సాధన చేసే క్రమంలో ఏకాగ్రత.. పట్టుదలలు సడలకూడదు. మనస్సు చంచలం కాకూడదు. సాధన ఎంత కాలం చేయాలి, దీనిని ఎక్కడ ఆపాలి..? అసలు ఆపచ్చా... అన్న ప్రశ్నలు.. సందేహాలు వస్తుంటాయి. సాధన నిలుపు చేయటం అన్న ఆలోచనే పుట్టకూడదు మనలో. వచ్చిన క్షణం మనలో నేర్చుకునే తపన చనిపోతుంది. చాలానే నేర్చుకున్నామన్న తృప్తి.. ఇంకా నేర్చుకోవలసిన అవసరం లేదన్న ఆలోచనే అందుకు కారణం! సాధనకు దూరమయ్యామంటే నేర్చుకున్న విద్య మీద పట్టు తగ్గచ్చు. అందుకే సాధన ఒక జీవనది కావాలి. ఎంత సాధన చేస్తే. అంత పరిపూర్ణత. అంత అలవోకగా చేయగల సామర్థ్యం వస్తుంది. నేర్చుకునే సమయంలో సాధన చాలా మంది చేస్తారు. ఇది సహజం. ఒక దశకు చేరుకున్న తరువాత శ్రద్ధ పెట్టం. కాని సాధన ఊపిరున్నంత వరకు చేయాల్సిందే. అలా చేసినవారే తమ విద్వత్తును, దానిలోని సారాన్ని అనాయాసంగా చదువరులకు లేదా శ్రోతలకు ఇవ్వగలరు. రంజింప చేయగలరు.

# ఇంట్లోనే నిమిషాల్లో ఐస్‌క్రీమ్‌లు
## తయారు చేసుకోవచ్చు.. ధర ఎంతంటే!

చల్లగా, తియ్యగా, కమ్మగా.. రకరకాల ఫ్లేవర్స్‌లో దొరికే ఐస్క్రీమ్ అంటే చప్పరించని వారెవరు? మరి అలాంటి ఐస్క్రీమ్‌ని మళ్లీమళ్లీ లాగించాలంటే ఇలాంటి మెషిన్ ఇంట్లో ఉండాల్సిందే. ఇందులో చాలా రకాల ఐస్క్రీమ్స్‌ను నిమిషాల్లో తయారు చేసుకోవచ్చు. ఆరోగ్యాన్నిచ్చే పండ్లు, కూరగాయలతో కూడా ఐస్క్రీమ్ తయారు చేసుకోవచ్చు. తగినన్ని పాలు, పంచదార, ఎసెన్స్‌ను జోడించి ఎన్నో రుచులను ఆస్వాదించొచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందిన.. 2 లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ డివైజ్ బౌల్‌ని ఫ్రిజ్‌లోనే ఉంచాలి. ఐస్‌క్రీమ్ తయారు చేసుకునే ముందు ఫ్రిజ్‌లోంచి తీసి, డివైజ్‌లో సెట్‌చేస్తే సరిపోతుంది. దానిపైన మూత, దానిపైనే పవర్ యూనిట్ అడ్జస్టబుల్‌గా ఉంటాయి. ఆన్, ఆఫ్ బటన్‌తోపాటు పవర్ బటన్ కూడా డివైజ్ పైనే కనిపిస్తూ ఉంటాయి. దాంతో దీన్ని వినియోగించడం చాలా ఈజీ. ఈ డివైజ్‌తో పాటు రెసిపీ బుక్ కూడా లభిస్తుంది.



# చేటలో ప్లాంట్.. బాల్కనీకి పల్లె సొగసు.. వెదురు అందం!




సహజంగా దొరికేవన్నీ ఆరోగ్యాన్ని, అందాన్ని ఇనుమడింపజేసేవే.. ఒంటికైనా.. ఇంటికైనా! ఆ జాబితాలోనిదే వెదురు కూడా. ఇప్పుడు గృహాలంకరణలో భాగమై ఇంటి అందాన్ని పెంచుతోంది. ఎలాగో చూద్దాం..

**బాల్కనీకి పల్లె సొగసు** ఆత్మీయులు.. సన్నిహితులు ఎవరైనా ఈ వేసవి సీజన్‌లో మామిడి పండ్లనో.. లేక ఈ కాలంలో దొరికే ఇంకే పళ్లనో వెదురు బుట్టలో పెట్టి కానుకగా పంపిస్తుంటారు కదా! ఖాళీ అయిన ఆ బుట్టను మూలన పడేయకుండా ఇలా వాల్ డెకార్‌కి వాడుకోవచ్చు. బాల్కనీలోకి పల్లె ఇంటి ఆవరణను తీసుకురావచ్చు.

**చేటలో ప్లాంట్** ప్లాస్టిక్ చేటలతో గడిపేస్తున్న కాలం ఇది. వెదురుతో అల్లిన చేట నిరుపయోగంగా కనిపిస్తుంటే ఇదిగో ఇలా ఓ మొక్కతో దాన్ని గోడ మీదకు చేర్చండి. ఆ గోడకు క్లాసీ లుక్‌నే కాదు.. ఇంటికొచ్చే అతిథులకూ మీ రిచ్ టేస్ట్‌ను చూపిస్తుంది.

**వేస్ట్ బుట్ట బెస్ట్** విడిచిన బట్టలు వేయడానికి, ఇంట్లో చెత్తను గుమ్మరించడానికి ప్లాస్టిక్ బాస్కెట్‌లనే ఎక్కువగా ఉపయోగిస్తున్న ఉన్నాం. అవి విరిగినా, రంగు వెలసినా స్క్రాప్ షాప్‌కి వెళ్లిపోతుంటాయి. అలా వేస్ట్ అనుకున్న ప్లాస్టిక్, ఐరన్ బాస్కెట్‌లను నార తాడుతో చుట్టి, లేదా గ్లూతో అతికించి అలంకరణ వస్తువుగా మార్చేసుకోవచ్చు.వీటిలో ఇండోర్‌ప్లాంట్స్ పెడితే నిండే పచ్చదనం.. ఇంటిని చల్లగా ఆహ్లాదకరంగా ఉంచుతుంది. అంటే వేస్ట్‌ను కూడా బెస్ట్‌గా మార్చి వ్యర్థాలు పెరగకుండా ప్రకృతిని కాపాడవచ్చన్నమాట.

కాదేదీ అలంకరణకు అనర్హం అన్నట్టుగా ఇలా ఈ వెదురు బుట్టలు, చేటలతో ఇంటికి ప్రకృతిని ఆహ్వానించ వచ్చు.. పచ్చదనాన్ని పదిలం చేసుకోవచ్చు. లేదంటే రంగుల కళతోనూ వెలుగులు నింపచ్చు.

# విపరీతంగా వైట్ డిశ్చార్జ్..
## మందులు వాడినా ప్రయోజనం లేదు.. పరిష్కారం ఏమిటి?

వైట్ డిశ్చార్జ్ అనేది చాలా సాధారణంగా కనిపించే సమస్య. దీనివల్ల ఓ పది శాతం మంది ఎలాంటి ఇబ్బంది లేకుండానే ఉంటారు. కొంతమందికి మాత్రం విపరీతమైన దురద, మంట, మూత్రనాళంలో మంట, తెల్లగా పెరుగులా వైట్ డిశ్చార్జ్ అవడం వంటి సమస్యలు ఉంటాయి. ఈ పరిస్థితిని కాండిడియాసిస్ (ఫంగల్ వెజైనల్ ఇన్‌ఫెక్షన్) అంటారు. దీనికి చికిత్స చేసినా అయిదు శాతం మందిలో మాత్రం ఈ సమస్య మళ్లీ వస్తుంది.కొంతమందిలో అల్సర్స్‌లా కూడా మారుతుంది. మధుమేహం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లలో , యాంటీబయాటిక్స్ ఎక్కువగా వాడే వాళ్లలో, గర్భనిరోధక మాత్రలు తీసుకుంటున్న వాళ్లలో ఈ సమస్య ఎక్కువ. డాక్టర్‌ను సంప్రదిస్తే వెజైనల్ పరీక్ష చేసి వైట్ డిశ్చార్జ్ (హై వెజైనల్ స్వాబ్)ను ల్యాబ్‌కు పంపిస్తారు. ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌ను నిర్ధారణ చేయడానికి.అసలు ఈ ఇన్‌ఫెక్షన్ రాకుండా.. వెజైనా దగ్గర ఎప్పుడూ పొడిగా ఉంచుకోవడం, శుభ్రమైన కాటన్ ఇన్నర్ వేర్‌నే వాడడం, అనవసరంగా యాంటీబయాటిక్స్ జోలికి వెళ్లకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. సమస్యను సరిగ్గా నిర్ధారించి.. దానికి తగిన చికిత్సను అందిస్తే ఈ సమస్య తొంభై శాతం నయమవుతుంది. ఇన్‌ఫెక్షన్ మరీ తీవ్రంగా ఉంటే fluconazole మాత్రలను వారానికి ఒకటి చొప్పున రెండు మూడు వారాలు వాడాలి.కొంతమందికి ప్రెగ్నెన్సీలో కూడా ఈ ఫంగల్ ఇన్‌ఫెక్షన్ తలెత్తుతుంది. డాక్టర్‌ను సంప్రదించి జాగ్రత్తగా ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. ట్రీట్‌మెంట్ తీసుకున్నా మళ్లీ ఈ ఇన్‌ఫెక్షన్ రావడాన్ని రికరెంట్ కాండిడియాసిస్ అంటారు. అలాంటప్పుడు ట్రీట్‌మెంట్‌ను ఎక్కువ వారాలు కొనసాగించాల్సి ఉంటుంది.మేడమ్.. నాకు పందొమ్మిదేళ్లు. పీరియడ్స్ టైమ్‌లో బ్రెస్ట్ చాలా నొప్పిగా ఉంటోంది. ఇదేమైనా క్యాన్సర్‌గా మారుతుందా? నాకు చాలా భయంగా ఉంది. దయచేసి ఆన్సర్ ఇవ్వగలరు. పీరియడ్స్ సమయంలో బ్రెస్ట్ నొప్పిగా ఉండడం అనేది సర్వసాధారణమైన సమస్య. ఇది చాలా వరకు పాతికేళ్లలోపు వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. రెండు వైపులా లేదా ఒక బ్రెస్ట్‌లో మాత్రమే నొప్పి రావచ్చు. కొంతమందికి ప్రతి నెలా వస్తుంది. కొందరికి ఎప్పుడో ఒకసారి ఉంటుంది. ఇది చాలా వరకు పీరియడ్స్ సమయంలో జరిగే హార్మోన్స్ చేంజ్ వల్ల వస్తుంది. బహిష్టు సమయంలో చాలా మందికి వాటర్ రిటెన్షన్ (నీరు పట్టడం) జరుగుతుంది. దానివల్ల బ్రెస్ట్ పరిమాణం పెరిగి నొప్పి కలగొచ్చు. లేదంటే బ్రెస్ట్‌లో ఏదైనా ఇన్‌ఫెక్షన్ ఉన్నా నొప్పి రావచ్చు. మీ వయసులో క్యాన్సర్ వచ్చే చాన్సెస్ చాలా అరుదు. అయినా ఒకసారి డాక్టర్‌ను సంప్రదించండి. పరీక్ష చేస్తారు.బ్రెస్ట్ పరిమాణం, గడ్డలు ఏమైనా ఉన్నాయా? నిపుల్ నుంచి పస్ గానీ, బ్లీడింగ్ గానీ, గ్రీన్ డిశ్చార్జ్ కానీ ఉందా? అని చెక్ చేస్తారు. 35 ఏళ్లలోపు వారికి బ్రెస్ట్ పెయిన్‌కి కొన్ని సార్లు ఏ పరీక్షలూ అవసరం ఉండవు. మీకు బ్రెస్ట్‌లో ఏదైనా గడ్డలాంటిది




ఉన్నా.. నొప్పి మరీ ఎక్కువగా ఉన్నా.. బ్రెస్ట్ అల్ట్రాసౌండ్ లేదా బయాప్సీ సూచిస్తారు. బహిష్టు సమయంలోనే వచ్చే బ్రెస్ట్ నొప్పికి చాలా వరకు బ్రెస్ట్ సపోర్ట్ బ్రా, వదులుగా ఉండే లోదుస్తులు వేసుకోవాలి.కొన్నిసార్లు పారాసిటమాల్ వంటి సింపుల్ పెయిన్ కిల్లర్స్‌ను వాడొచ్చు. కాఫీ, టీల జోలికి వెళ్లొద్దు. విటమిన్ ఇ మాత్రలు వాడొచ్చు. నొప్పి నివారణలో ఇవీ సహాయపడనప్పుడు డాక్టర్‌ను సంప్రదించి.. వైద్యులు సూచించిన మాత్రలు తీసుకోవడం మంచిది.

కొంతమంది గర్భిణీలకు ప్రెగ్నెన్సీ చివరి మూడు నెలల్లో కొంతమందికి స్కానింగ్‌లో బిడ్డ ఎదుగుదల సరిగ్గాలేనట్టు తెలుస్తుంది. దీనిని స్మాల్ ఆఫ్ జెస్టేషనల్ ఏజ్ అంటారు. ఇది అంత ప్రమాదకరం కాదు. దీనికి చాలా కారణాలు ఉండవచ్చు.మీరు, మీ భర్త ఇద్దరూ అంతగా హైట్ లేకపోవడం, బరువు కూడా తక్కువగా ఉండడం, కొన్ని ప్లెసెంటా సరిగ్గా పనిచెయ్యక బిడ్డ ఎదుగుదల తక్కువగా ఉండడం, మీకు హై బీపీ ఉండడం, కొన్ని మందులు, రక్తహీనత, కొన్ని జన్యుపరమైన సమస్యలు, ప్రెగ్నెన్సీలో తలెత్తే ఇన్‌ఫెక్షన్స్ వంటివి ఆ కారణాల్లో ఉండొచ్చు.

ఇలా సమస్యలకు మూలం తెలిసినప్పుడు దానికి తగిన చికిత్సను అందజేస్తారు వైద్యులు. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలి. పోషకాహారం.. ముఖ్యంగా మాంసకృత్తులు ఎక్కువగా (హై ప్రొటీన్ డైట్) ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. బిడ్డ ఎదుగుదలను రెండు లేదా మూడు వారాలకు ఒకసారి చెక్ చేస్తారు డాక్టర్. బిడ్డకు రక్తప్రసరణ ఎలా ఉందనేదీ వారానికి ఒకసారి చెక్ చేస్తారు.రక్తప్రసరణ, ఉమ్మనీరు సరిగ్గా ఉంటే, తొమ్మిదవ నెల నిండిన తర్వాత ప్రసవానికి ప్లాన్ చేస్తారు. సాధారణ కాన్పుకి ప్రయత్నించవచ్చు. బిడ్డకు రక్తప్రసరణ సరిగా లేకపోతే కొన్నిసార్లు ముందస్తు ప్రసవానికి వెళ్లాల్సి వస్తుంది. అప్పుడు బిడ్డకు శ్వాస సమస్యలు తలెత్తకుండా ఒక కోర్స్ కార్టికోస్టెరాయిడ్స్ ఇవ్వాల్సి ఉంటుంది. సాధారణ కాన్పు కాకుండా సిజేరియన్ చేయాల్సి వస్తుంది.

# రొబోటిక్స్‌తో నాలాలు క్లీన్..

'నేను పుట్టిపెరిగింది నారాయణపేట. తర్వాత చదువు అంతా హైదరాబాద్‌లోనే. ఉద్యోగరీత్యా కెనడా వెళ్లాను. పదిహేనేళ్ల పాటు అక్కడే ఉద్యోగం చేశాను. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. తర్వాత తిరిగి సొంత ప్రదేశానికి వచ్చేశాను. నా చిన్నతనంలో చూసిన ప్రాంతాలకు%-- % ఇప్పటికీ చాలా మార్పు కనిపించింది. చిన్నప్పుడు చెరువుల దగ్గరకు వెళ్లినప్పుడు అక్కడి వాతావరణం చాలా ఆహ్లాదం గా అనిపించేది. ఇప్పుడు చెత్తతో, దుర్గంధంతో ఉండటం చూశాను. అలాగే పట్టణాల్లోని నాలాల్లో చెత్త పేరుకు పోవడం, నీళ్లు సాఫీగా వెళ్లకపోవడం గమనించాను. దీనివల్ల వర్షాకాలం జనం పడే అవస్థలు చూశాను. డ్రైనేజీల్లో మనుషులు చేసే పనులు, వాటి వల్ల వాళ్లు ఎదుర్కొనే ఆరోగ్యసమస్యలు గమనించాను. డ్రైనేజీల్లో పనిచేసిన కార్మికులు కొంతమంది మరణించిన ఘటనలు కూడా తెలుసు. వీటికి పరిష్కారంగా విదేశాల్లో సాంకేతికంగా చాలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. మన ప్రాంతంలో అలాంటి చర్యలేవీ కనిపించలేదు.



**నాలుగు రోబోటిక్ డివైజ్‌లు** ఇప్పటికీ మున్సిపాలిటీ లు 60 శాతం చెత్తను మాత్రమే సేకరిస్తున్నాయి. మిగిలిన 40 శాతం చెత్తను ప్రజలు చెరువులు, నాలాల్లోనే వేస్తున్నారు. వీటిని శుభ్రం చేయడానికి తిరిగి మనుషులను నియమించాల్సి ఉంటుంది. అలాకాకుండా చెరువులు, నాలాలను, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ క్లీన్ చేయడానికి రొబోటిక్ డివైజ్‌లను డిజైన్ చేశాను. ఎన్వీ రొబోటిక్ పేరుతో సంస్థను నడుపుతున్నాను. మా టీమ్‌లో మొత్తం పదిమందిమి ఉన్నాం. ఈ రొబోటిక్ డివైజ్ చెరువులో నుంచి ఒకేసారి టన్ను సామర్థ్యం గల చెత్తను సేకరించి, బయటకు వేస్తుంది. రోజుకు పది టన్నుల ప్లాస్టిక్, ఇతర తేలియాడే వ్యర్థాలను సేకరించగలదు. ముందు పైలట్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో చేశాం. తర్వాత మహబూబ్‌నగర్, నారాయణ్ పేట మున్సిపాలిటీలలో నిర్వహించాం. మంచి ఫలితాలు వచ్చాయి. త్వరలో హైదరాబాద్ లో పనులు చేపట్టాలనుకుంటున్నాం.

**మరెక్కడా లేని సాంకేతికత** ఇలాంటి డివైజ్‌లను ఇప్పటి వరకు ఎవ్వరూ డిజైన్ చేయలేదు. ఈ రోబొటిక్ డివైజ్‌ల తయారీ పూర్తిగా మా సొంత డిజైన్. పేటెంట్‌కి అప్లై చేశాం. ఒక్కో రొబోటిక్ డివైజ్ తయారీకి రూ.6-7 లక్షల రూపాయల ఖర్చు అవుతుంది. నాలా, వేస్ట్ ఫ్లో .. ను పరీక్షించి డివైజ్ చేయాల్సి ఉంటుంది. దీనికి కావల్సిన వస్తువుల కోసం మన దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా వెళ్లాల్సి ఉంటుంది. సొంతంగా కొన్ని పరికరాలను తయారుచేయించాల్సి ఉంటుంది.నేననుకున్న ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి దగ్గర బంధువులు, మా కుటుంబం సపోర్ట్ లభించింది. నా ప్రాజెక్ట్ నచ్చి తెలంగాణలోని 'విహబ్' సాయం అందించడానికి ముందుకు వచ్చింది..

**మనుషులను గౌరవిద్దాం..** వ్యర్థాలను నియంత్రించడంలో మనందరిలో పర్యావరణ బాధ్యత ఉండాలి. అంతేకాదు మన తోటి మనిషిని గౌరవించాలి. అప్పుడు మన చుట్టూ వాతావరణం బాగుంటుంది. మనలో చాలామంది ప్లాస్టిక్‌తో సహా రకరకాల వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపులా, నాలాల్లో, చెరువుల్లోనూ పడేస్తుంటారు. పెద్ద ఎత్తున డంప్ అయ్యే చెత్తను చూస్తుంటే భవిష్యత్తు గురించిన భయం కూడా కలుగుతుంది. మన ఇంటి డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కి ఉండే మూతనే దాదాపు టన్ను బరువు ఉంటుంది. దానిని ఎత్తాలంటే మనిషి వెన్నెముకపై పడే భారం ఎంత ఉంటుందో గ్రహించవచ్చు. అతనిమీద ఆధారపడే ఆ కుటుంబం పరిస్థితి ఏంటి? అనే ఆలోచన మనందరిలోనూ రావాలి. అలాంటివాటిని ఎత్తడానికి కూడా రొబోటిక్ కంట్రోల్ డివైజ్‌ను డిజైన్ చేశాం. మ్యాన్‌హోల్ కవర్ లిఫ్టర్.. తయారు చేశాం. మ్యాన్‌హోల్ క్లీనర్‌పైన ఈ డివైజ్‌ను ఉంచితే అదే చెత్తనంతా తీసి, బయటకు వేసేస్తుంది. చెత్త కోసం మనుషులను వినియోగించకుండా, వారిని ఇతర రంగాలకు మళ్లించాలి. చెత్తను శుభ్రం చేయడానికి పరికరాలను ఉపయోగించాలి అన్నదే నా ఆలోచన. మన దగ్గర ఈ విధానంలో ముందు చూపు, త్వరిగతిన పనులు అవడం ఎక్కువ అవసరం" అని వివరించారు పద్మ.

# ఉప్మా మిగిలిపోయిందా..
## ఇలా రుచికరమైన బోండాలు చేసుకోండి!

కొంతమందికి ఉప్మా తినడం పెద్దగా ఇష్టం ఉండదు. అలాంటి వాళ్లకు రుచికరమైన ఉప్మా బోండా చేసిపెడితే బాగుంటుంది. నిజానికి ఉప్మా మిగిలిపోయినపుడు ఈ రెసిపీ చేసుకుంటే వెరైటీకి వెరైటీ.. రుచికి రుచి కూడా!



**ఉప్మా బోండా తయారీకి కావలసినవి:** ఉప్మా ఒకటిన్నర కప్పులు ( నచ్చిన ఫ్లేవర్‌లో.. నచ్చిన విధంగా చేసుకోవచ్చు.. చల్లారిన తర్వాత చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి)?శనగపిండి ఒక కప్పు, బియ్యప్పిండి 2 టీ స్పూన్లు, బేకింగ్ సోడా పావు టీ స్పూన్ కారం, వాము అర టీ స్పూన్ చొప్పున, ఉప్పు తగినంత, నీళ్లు సరిపడా, నూనె డీప్ ఫ్రైకి సరిపడా

**ఉప్మా బోండా తయారీ విధానం:** ముందుగా శనగపిండి, బియ్యప్పిండి, బేకింగ్ సోడా, కారం, వాము (నలిపి వేసుకోవాలి), ఉప్పు వేసుకుని కొద్దికొద్దిగా నీళ్లు పోసుకుంటూ.. ఉండలు లేకుండా తోపు సిద్ధం చేసుకోవాలి. అభిరుచిని బట్టి పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తురుము, కరివేపాకు వంటివి అందులో కలుపుకోవచ్చు.అనంతరం ఉప్మా ఉండల్ని ఆ తోపులో రెండు మూడు సార్లు ముంచి.. నూనెలో దోరగా వేయించుకోవాలి. వేడివేడిగా ఉన్నప్పుడే తింటే భలే రుచిగా ఉంటాయి.

# సత్తు షర్బత్..
## వేసవిలో శరీరానికి వేడిచేయకుండా కాపాడుతుంది..!

**కావలసినవి:** వేయించిన శనగపప్పు కప్పు, నిమ్మకాయలు రెండు, పంచదార పొడి రెండు టేబుల్ స్పూన్లు, పుదీనా ఆకులు ఏడు, పచ్చిమిర్చి ఒకటి (సన్నగా తరగాలి), జీలకర్ర పొడి అరటీస్పూను, బ్లాక్ సాల్ట్ పావు టీస్పూను, సాధారణ సాల్ట్ పావు టీస్పూను, ఐస్‌క్యూబ్స్ పావు కప్పు.

**తయారీ:** శనగపప్పుని మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ఈ పొడిని జల్లెడపట్టుకుని ఒకగిన్నెలోకి తీసుకోవాలి. శనగపిండిలో కొద్దిగా నీళ్లుపోసి ఉండలు లేకుండా కలపాలి. తరువాత కప్పు నీళ్లుపోసి మరోసారి కలుపుకోవాలి ఇప్పుడు దీనిలో బ్లాక్‌సాల్ట్, సాధారణ సాల్ట్, పంచదార పొడి, జీలకర్ర పొడి, పచ్చిమిర్చి తరుగు, నిమ్మరసం, పుదీనా ఆకులను సన్నగా తరిగి వేసి చక్కగా కలపాలి చివరిగా ఐస్‌క్యూబ్స్ వేసి సర్వ్‌చేసుకుంటే సత్తు షర్బత్ ఎంతో రుచిగా ఉంటుంది. ఈ షర్బత్‌లోని ఉప్పు, ఐరన్, పీచుపదార్థం జీర్ణక్రియను సక్రమంగా జరిగేలా చేసి గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలను దరిచేరనివ్వవు.దీనిని పరగడుపున తీసుకుంటే మరింత బాగా పనిచేస్తుంది

శరీరంలోని టాక్సిన్‌లను బయటకు పంపి మంచి డీటాక్సింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. వేసవిలో రోజుకొక గ్లాస్ తాగితే.. దాహం తీరడంతోపాటు, శరీరానికి వేడిచేయకుండా ఉంటుంది.



# ఎత్తు మడులపై పత్తి అంతరపంటగా కంది!

పత్తి సాగులో సమస్యలను అధిగమించడానికి బెడ్స్ (ఎత్తు మడులు) పద్ధతిని అనుసరించడం మేలని నిపుణులు చెబుతున్నారు. ట్రాక్టర్‌తో బెడ్స్ ఏర్పాటు చేసుకొని ఒక సాలు పత్తి, పక్కనే మరో సాలు కందిని మనుషులతో విత్తుకోవటం మేలని సూచిస్తున్నారు. వర్షం ఎక్కువైనా, తక్కువైనా.. కండగల నల్లరేగడి నేలలైనా, తేలికపాటి ఎర్రనేలలైనా.. బెడ్స్‌పై పత్తిలో కందిని అంతర పంటగా విత్తుకోవటం రైతులకు ఎన్నో విధాలుగా ఉపయోగకరమని చెబుతున్నారు.పత్తి పంటను ఎత్తుమడుల (బెడ్స్)పై విత్తుకోవటమే మేలని, అందులో కందిని అంతర పంటగా 1:1 నిష్పత్తిలో వేకోవటం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలున్నాయని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రయోగాత్మక సాగులో తొలి అనుభవాలు తెలియజేస్తున్నాయి. బెడ్స్‌పై పత్తి, కంది మిశ్రమ సాగుపై రెండేళ్లుగా అనేక విధాలుగా ప్రయోగాలు చేస్తున్న డా. ప్రవీణ్ మూడేళ్ల తర్వాత పూర్తి ఫలితాలు వెల్లడవుతాయని అన్నారు.అయితే, ఇప్పటికి గ్రహించిన దాన్ని బట్టి పత్తిలో కంది పంటను బెడ్స్‌పై 1:1 నిష్పత్తిలో విత్తుకోవటం మేలని భావిస్తున్నారు. కందిని 1:1 నిష్పత్తిలోనే విత్తుకోవాలనేం లేదని, 4:1 నిష్పత్తిలో (4 సాళ్లు పత్తి, 1 సాలు కంది) కూడా విత్తుకోవచ్చని ఆయన సూచిస్తున్నారు. కండగల నల్లరేగడి నేలల్లో అయినా, తేలికపాటి ఎర్ర నేలల్లో అయినా బెడ్స్ పద్ధతిలో పత్తిలో కందిని అంతరపంటగా విత్తుకుంటే వర్షం ఎక్కువైనా, తక్కువైనా ఇబ్బంది ఉండదని ఆయన తెలిపారు. గత ఏడాది నల్ల రేగడి నేలలో బెడ్స్‌పై పత్తిలో కంది పంటను 1:1 నిష్పత్తిలో విత్తి మంచి ఫలితాలు సాధించారు. బెడ్ వెడల్పు అడుగు. రెండు బెడ్స్ మధ్య దూరం 5 అడుగులు. ట్రాక్టర్ సహాయంతో బెడ్స్ ఏర్పాటు చేయించారు. మొక్కల మధ్య అడుగు దూరం పాటించారు. మనుషులతో బెడ్స్‌పై విత్తనం నాటించారు. గత ఏడాది సాధారణం కన్నా అధిక వర్షాలు కురిసినప్పటికీ.. బెడ్స్ పద్ధతి వల్ల పొలంలో నీరు నిలబడలేదు. దీని వల్ల పంట పెరుగుదలకు ఎటువంటి ఆటంకం కలగలేదు.బెడ్స్ మీద విత్తిన విత్తనం సాధారణ పొలంలో కన్నా ఒకటి, రెండు రోజులు ముందే మొలిచింది. అంతేకాదు, 90% వరకు మొలక వచ్చింది. వర్షపు నీరు ఒక్క రోజు కూడా పొలంలో నిలవకుండా కాలువల ద్వారా బయటకు వెళ్లిపోయింది. దీని వల్ల తొలి దశలో మొక్క పెరుగుదల ఒక్క రోజు కూడా కుంటుపడలేదు. బెడ్స్ లేకపోతే ఎక్కువ వర్షం పడినప్పుడు ఉరకెత్తే సమస్య ముఖ్యంగా నల్లరేగడి పొలాల్లో సాధారణం. బెడ్స్ వల్ల ఈ సమస్య లేకుండా పోయింది. అంతేకాదు, కాయకుళ్లు సమస్య కూడా తీరిపోయిందని డా. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బెడ్స్ లేకుండా సాగు చేసే పొలాల్లో



పత్తి మొక్కలకు కింది కొమ్మలకు మొదట్లో వచ్చే 5-10 కాయలు కుళ్లిపోతూ ఉంటాయి. బెడ్స్ మీద వేయటం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి, తేమ తగుమాత్రంగా ఉండటం వల్ల కాయ కుళ్లు లేదన్నారు. బెడ్స్ పద్ధతిలో విత్తిన పొలాల్లో కూడా గులాబీ రంగు పురుగు ఉధృతి మామూలుగానే ఉంది. గులాబీ పురుగు ఉధృతి ఎక్కువయ్యే కాలానికి, అంటే నవంబర్ ఆఖరు నాటికే పత్తి మొక్కలను తీసేశాం. అయినా ఎకరానికి 5.5 క్వింటాళ్ల మేరకు పత్తి దిగుబడి వచ్చిందని డా. ప్రవీణ్‌కుమార్ అన్నారు. గులాబీ పురుగును సమర్థవంతంగా అదుపు చేయగలిగితే మరో 3-4 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదన్నారు. నవంబర్ ఆఖరులో పత్తి తీసేసినా.. కంది పంట జనవరి వరకు ఉంచారు. ఎకరానికి 5.5 క్వింటాళ్ల కందుల దిగుబడి కూడా వచ్చింది. అంటే, ఒక ఎకరంలో రెండు పంటలూ కలిపి 11 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఒకవేళ పత్తి పంట ఏ కారణంగానైనా దెబ్బతింటే.. కంది పంటయినా రైతును ఆదుకుంటుందని.. అందుకని పత్తితో పాటు కందిని కూడా వేసుకోవటం మేలని డా. ప్రవీణ్ కుమార్ రైతులకు సూచిస్తున్నారు. బెడ్స్‌పై కాకుండా మామూలుగా నల్లరేడగడి పొలంలో పత్తి మాత్రమే విత్తుకున్న రైతులు కూడా చాలా మంది ఐదారు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి తీయగలిగారన్నారు. అధిక వర్షాల వల్ల పంట పెరుగుదల లోపించటం, గులాబీ పురుగు ఉధృతిని అదుపు చేయలేకపోవటం వల్ల దిగుబడి తగ్గిందన్నారు. తేలికపాటి ఎర్ర నేలల్లో అయినా పత్తితోపాటు కందిని బెడ్స్‌పై విత్తుకుంటే వర్షం ఎక్కువైనా, తక్కువైనా ఇబ్బంది ఉండదన్నారు. తేమ త్వరగా ఆరిపోకుండా ఉండటానికి బెడ్స్ ఉపయోగపడతాయన్నారు. ఈ ఏడాది కూడా సాధారణం కన్నా అధికంగానే వర్షాలు పడతాయని భావిస్తున్న నేపథ్యంలో బెడ్స్ పద్ధతిని రైతులు అనుసరించడం మేలు.

# వింటర్ బ్లూస్ వేధిస్తుంటే..

శీతకాలం రాగానే కొందరిలో తెలియని నీరసం ఆవహిస్తుంది. ప్రతి చలికాలం ఇలానే జరుగుతుంటే.. సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ (ఎస్ఏడీ)కు గురవుతున్నట్టు లెక్క. దీన్నే ఆంగ్లంలో **'వింటర్ బ్లూస్' అంటారు. ఈ రుగ్మత లక్షణాలు..**మనసులో అకారణ బాధ, నిరుత్సాహం, నిరాసక్తత, అతిగా తినడం, వేగంగా బరువు పెరగడం, అధిక కార్బొహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవాలనే కోరిక కలగడం, అతి నిద్ర, అలసట.. సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్‌ను సూచించేవే. చలికాలంలో సూర్యకాంతి తగ్గడం వల్ల శరీరంలోని జీవగడియారం పని తీరుకు అంతరాయం కలుగుతుంది. దీన్నొక కారణంగా చెప్పవచ్చు. ఎండ తక్కువగా తగలడం వల్ల రక్తంలో సెరటోనిన్‌గా పిలిచే ఫీల్‌గుడ్ హార్మోన్ స్థాయిలు తగ్గిపోతాయి. ఫలితంగా నిరుత్సాహం, కుంగుబాటు ఆవహిస్తాయి. వంశ పారంపర్యంగానూ వచ్చే ఆస్కారం ఉంది. లోపం ఇదే.. ప్రధానంగా విటమిన్-డి తక్కువగా ఉండే ఆహారం తీసుకునే వారు దీని బారిన పడతారు. జాగ్రత్త పడాల్సిందే.. శీతకాలంలో వచ్చే ఈ సమస్యల్ని అశ్రద్ధ చేస్తే తీవ్ర అనారోగ్యానికి దారితీయవచ్చు. నలుగురిలో కలవ లేకపోవడం, ఆఫీసులో సరిగ్గా పనిచేయలేకపోవడం ప్రధాన లక్షణాలు. మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడవచ్చు. అకారణ దుఃఖం, ప్రతికూల ధోరణులు, ఆత్మహత్య ఆలోచనలు వెంటాడుతాయి. విటమిన్-డి మాత్రలతో పాటు యాంటీ డిప్రెసెంట్స్ ఇస్తారు. వివిధ థెరపీల ద్వారా వైద్యులు చికిత్స చేస్తారు. వ్యాయామం, సమ తులాహారమూ ముఖ్యమే.




# అకుశలాలు చివరికి దుఃఖాన్నే తెచ్చిపెడతాయి..



కుశల కర్మలు అంటే మంచి పనులు. అకుశల కర్మలు అంటే చెడ్డ పనులు. ప్రతి మనిషి మనస్సులో, ఆలోచనల్లో ఈ రెండూ ఉంటాయి. పుట్టుకతోనే 'వీరు మంచివారు' 'వీరు చెడ్డవారు' అని విభాగించుకుని పుట్టరు. వ్యక్తిగా, సామాజికంగా పెరిగిన కొద్దీ మనలో ఈ భావాలు పెరుగుతాయి. కుశల ధర్మాలు మనకి శాంతిని ఇస్తాయి. అకుశలాలు చివరికి దుఃఖాన్నే తెచ్చిపెడతాయి. అయితే మనిషి దుఃఖంలేని కుశల మార్గంలోనే నడవడం ఏదోఒక క్షణంలోనో, రోజులోనో జరిగే పని కాదు. ఎంత సాధన చేసి మంచిగుణాలు అలవర్చుకున్నా ఏదో క్షణంలో బుద్ధుడు చెప్పినట్లు చిటికె వేసినంత కాలంలో%--% అకుశలం వచ్చి ఆవహించేస్తుంది. కాబట్టి మనిషి కుశల చిత్తంతో మెలగాలంటే నిరంతరం అదే ధ్యాసలో ఉండాలి. నడవాలి. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు ఎందరో భిక్షువులు ఎంతెంతో సాధన చేసినవారు కూడా ఆ చిటికెల కాలంలోనే దారి తప్పేవారు. ఈ విషయంలో ఎందరో బుద్ధుని దగ్గరకు వచ్చి...'భగవాన్! మా చిత్తాన్ని నిలుపుకోలేకపోతున్నాం. ఏదో క్షణంలో చెడ్డ భావాలు వచ్చి పడుతున్నాయి. వానినుండి ఎలా బైటపడగలం" అని అడిగేవారు. అప్పుడు బుద్ధుడు... 'మీరు అందుకోసం నిరంతరం పది సాధనా మార్గాల్లో ఉండాలి' అంటూ వాటి గురించి చెప్పాడు. అప్రమత్తంగా ఉండటం, సోమరితనంతో గడపడం, అతిగా కోరుకోవడం, ఎంత లభించినా ఇంకా, ఇంకా కావాలి అనే అసంతృప్తి నిరంతరం నిర్లక్ష్యంగా ఉంచే అజాగ్రత్త, ఏ విషయాన్నైనా లోతుగా గ్రహించకపోవడం వల్ల కూడా అవగాహనాలేమి, చెడ్డవారి స్నేహం, వీటితోపాటుగా జాగరూకతను నిరంతరం పెంచుకోకపోవడం చెడ్డవారిని అనుసరిస్తూ, అకుశల కర్మలే శిక్షపొందుతూ ఉంటే.. ఈ పది కార్యాల వల్ల మనిషితో అకుశల ఆలోచనలు పెరుగుతాయి. అకుశల ఆచరణలు జరుగుతాయి. అలాంటి వానికి సంపద నష్టం, కీర్తి నష్టం, ప్రజ్ఞ నష్టం, సకలం నష్టం. దీనివల్ల దుఃఖం. అలాగే కుశల ధర్మాలు పెరగాలంటే ప్రమత్తతను వీడి అప్రమత్తతతో సోమరితనాన్ని వదిలి ఉండాలి. పట్టువదలని సాధనలో ఉండాలి. అధిక కోర్కెల్ని వదిలి, బతకడానికి సరిపడు మితమైన కోర్కెలు (అల్పేచ్ఛ) కలిగి ఉండాలి. సంతృప్తి కలిగి, జాగరూకతతో మెలగాలి. ప్రతి విషయం పైనా మంచి అవగాహన పెంపొందించుకోవాలి.

మంచిని చేకూర్చే మంచి మిత్రులతోనే స్నేహం చేయాలి. మంచివారిని అనుసరించాలి. మంచి కర్మల శిక్షణ పొందాలి. ఈ పది కార్యాల వల్ల మనిషిలో కుశల ఆలోచనలు పెరుగుతాయి. కుశల ధర్మాలు ఉద్భవిస్తాయి. కుశలాచరణ కలుగుతుంది. అలాంటి వారికి సంపద నష్టం కాదు. కీర్తికి నష్టం రాదు. ప్రజ్ఞ దిగజారిపోదు. దుఃఖం దరికే రాదు. అని చెప్పాడు బుద్ధుడు. ఇలా ప్రతి వ్యక్తి తనను తాను తీర్చిదిద్దుకుంటే, అది వ్యక్తికి, సంఘానికి, దేశానికి, ప్రపంచానికి మేలు అని బోధించిన తథాగత బుద్ధునికి జేజేలు!

# ఈ తమ్ముడు మళ్ళీ దొరకడు!



'ఇమ్ముగ చదువనినోరును, అమ్మాయని పిలిచి అన్నమడుగని నోరున్, తమ్ముల పిలువని నోరును..." అన్న సుమతీ శతకంలోని పద్యం గురించి తెలుసుకుంటున్నాం. లోకంలో స్నేహితులు ఎక్కడికెళ్ళినా దొరుకుతారు. చిన్నతరగతులనుంచీ, కళాశాలలు ...ఆ తరువాత ఉద్యోగాల్లో ...అలా అన్ని స్థాయుల్లో, అన్ని ప్రాంతాల్లో, అన్ని వేళ ల్లో దొరుకుతారు. పెళ్ళిళ్ళు తదితరాలతో బాంధవ్యాలు కలిసి బంధువులు కూడా కొత్తగా దొరుకుతుంటారు. పుట్టగానే పరమేశ్వరుడిచ్చిన బంధుత్వం మాత్రం అమ్మానాన్నలతోనే. వాళ్ళ ఆఖరి ఊపిరి వరకు వాళ్ళు కోరుకునేది, నీవు వాళ్ళకు ఏదో చేయాలని కాదు, నీకు వాళ్ళేం చేయగలరని...! ఆ ఆర్తి సహజంగా వాళ్లకు తప్ప వేరెవరికీ ఉండనే ఉండదు. అటువంటి వాటిలో ఒకటి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళతో ఉండే అనుబంధం. నాతో కలిసి పుట్టిన వాళ్ళతో అనుబంధం అపూర్వం. నా తమ్ముడు ఈ జన్మకంతటికీ వాడే నా తమ్ముడు. అక్క ఈ జన్మకు ఆమే అక్క. నేను చాలామందిని చెల్లెళ్ళగా చూడవచ్చు. కానీ మా అమ్మానాన్నల కడుపున నాతో కలిసి పుట్టిన చెల్లి అదొక్కతే. దానితో సమానం మాత్రం ఎవరూ కారు, కాలేరు. వాచికంగా.. ఆమె నా చెల్లెలి తో సమానం అంటాం. కానీ ఆమె స్థానాన్ని భర్తీ చేయడం మాత్రం సాధ్యం కాదు. తోడబుట్టినవాడు అంటే ఆ అనుబంధం మరొకరితో ఉండదుగాక ఉండదు. శ్రీ రామాయణం లో రావణాసురుడు ప్రయోగించిన శక్త్యాయుధం ఒకటి లక్ష్మణుడిని తాకి ఆయన కిందపడి మూర్ఛిల్లాడు. యుద్ధంలో ఉన్న రాముడు వెంటనే వచ్చి తమ్ముణ్ణి పట్టుకుని బావురుమని ఏడ్చాడు. "దేశేదేశే కళత్రాణి దేశేదేశే చ బాంధవః తం తూ దేశ నా పశ్యామి యాత్ర భ్రాత్ర సహోదరః" అన్నాడు. భార్య దొరుకుతుంది, బంధువులు ఎక్కడికెళ్ళినా దొరుకుతారు. కానీ వాడొక్కడే ఈ జీవితానికి. అంత అపురూపం రా అన్నదమ్ములు. నువ్వే లేకపోతే నాకెందుకురా ఈ రాజ్యాలు, ఈ సుఖాలు? నాకోసం అడవికి వచ్చావు, నా కోసం యుద్ధానికి వెళ్లావు, నువ్వే పడిపోయిన నాడు నాకు మిగిలిన సుఖాలు అన్నీ ఏకమై తిరిగి లభించినా, వాటివల్ల ప్రయోజనమేమిటి?" అని అడిగాడు. తోడబుట్టినవాడు వెళ్ళిపోయిన తరువాత బతుకు శూన్యమని భావించాడు. రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురూ పట్టాభిషేక సమయానికి బతికే ఉన్నారు. వాలి సుగ్రీవుల్లో వాలి మరణించాడు. రావణ కుంభకర్ణులు ఇద్దరూ పోగా విభీషణుడొక్కడు మిగిలాడు. రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల మైత్రీబంధం చూసి అక్కడే ఉన్న విభీషణుడు 'మేం మా సోదరులతో ఇలా బతకలేక పోయాం...' అని చాటుగా కళ్ళొత్తుకున్నాడు. సుగ్రీవుడి కళ్ళు చెమర్చాయి. అన్నగారు బాగా పెద్దవాడయి పోయిన తరువాత కూడా నెమ్మదిగా వాహనం దిగుతుంటే తమ్ముళ్ళు గబగబా వెళ్ళి చెయ్యి ఆసరాగా ఇచ్చి 'అన్నయ్యా! జాగ్రత్త' అంటూ తీసుకువస్తుంటే, ఏ విషయమైనా అన్నయ్యకు చెప్పి చేస్తుంటే.. తమ్ముళ్ళ మంచీచెడూ విచారించే అన్నయ్య ఎప్పుడూ వాళ్ళకు తోడుగా ఉంటే అసలు ఆ ఇంట ఎంత ఆరోగ్యం, ఎంత ఆయుర్దాయం ఉంటుందో... ఆ రక్తసంబంధం ఉన్నవాళ్లు కలుసుకోవడం ఎంత సంతోషంగా ఉంటుందో..!!!

## దోమలు మన దగ్గరకే రాకుండా ఉండాలంటే ఏం చేయాలంటే?



సాయంత్రమైందంటే చాలు పరుగెత్తుకొస్తాయి దోమలు. చెవుల పక్కన చేరి వాటి భాషలో హాలో చెబుతుంటాయి. కుట్టి కుట్టి రక్తాన్ని పీల్చేస్తుంటాయి. అంతటితో అయి పోతుందా.. లేనిపోని రోగాలను కూడా అంటిస్తాయి. అందుకే దోమ తెరలు, ఆల్ అవుట్‌లు, రకరకాల ప్రయోగాలతో దోమల్ని దూరం పెట్టేందుకు ప్రయత్నిస్తుంటాం. ఇవన్నీ సరే.. మనం ఎక్కడున్నా సరే అసలు దోమలు మన దగ్గరకే రాకుండా ఉండాలంటే ఏం చేయాలని చాలా మంది అనుకునే ఉంటారు. తాజాగా శాస్త్రవేత్తలు కూడా ఇదే ఆలోచనపై పరిశోధన చేశారు. 4 రకాల రంగుల బట్టలు వేసుకుంటే దోమలు మనల్ని కాస్త తక్కువగా కుడతాయని, ఇంకో 4 రకాల రంగుల బట్టలేసుకుంటే మాత్రం 'అంతే' సంగతులని కనుగొన్నారు. ఆ రంగుల కథేంటో, దోమలు రంగులను ఎలా గుర్తిస్తు న్నాయో తెలుసుకుందాం. మనుషులు విడుదల చేసే కార్బన్ డై ఆక్సైడ్, చెమట వాసన, శరీర ఉష్ణోగ్రతను గుర్తించాక నేరుగా మనుషుల దగ్గరకు దోమలు వస్తున్నాయని ఇదివరకే కనుగొన్నారు. తాజా పరిశోధనలో నాలుగో అంశాన్ని కూడా శాస్త్రవేత్తలు గుర్తించారు. అదే 'రంగు'. చెమట, కార్బన్ డై ఆక్సైడ్ వాసన గుర్తించనంత వరకు మనుషులున్నా, ఇంకేమున్నా దోమలు పట్టించుకోలేదని.. కానీ వాటి వాసనను పసిగట్టాక మాత్రం ఆ వాసన వస్తున్న వైపు ఎగురుతున్నాయని గుర్తించారు. అయితే ఇందులోనూ ఇంకో ఆసక్తికరమైన అంశాన్ని కనుగొన్నారు. వాసన వచ్చే ప్రాంతంలో ఎరుపు, నారింజ, నలుపు, సియాన్ రంగులవైపు దోమలు ఎక్కువగా వెళ్లాయని.. ఆకుపచ్చ, ఊదా, నీలం, తెలుపు రంగులను పట్టించుకోలేదని గమనించారు. మనుషుల శరీరం దోమలకు ఎరుపు%--%నారింజ రంగు రూపంలో కనిపిస్తుందని, అందుకే నేరుగా మన దగ్గరకు వచ్చేస్తాయని తెలుసుకున్నారు. మన శరీర ఛాయతో వాటికి సంబంధం లేదని, అన్ని శరీరాలూ వాటికి ఎరుపు%--%నారింజ రంగులోనే కనిపిస్తాయని చెబుతున్నారు. కాబట్టి ఎరుపు, నారింజ, నలుపు, సియాన్ రంగుల బట్టలు వేసుకుంటే మన శరీర రంగుకు ఆ బట్టల రంగు తోడై దోమలు మరింత ఎక్కువగా మన దగ్గరకు వస్తాయని అంటున్నారు. ఆకుపచ్చ, ఊదా, నీలం, తెలుపు రంగుల బట్టలు వేసుకుంటే కాస్త తక్కువగా ఆకర్షితమవుతాయని వివరిస్తున్నారు. పరిశోధన కోసం ఒక్కో దోమను ఒక్కో టెస్ట్ చాంబర్‌లో పెట్టి మరీ శాస్త్రవేత్తలు పరీక్ష చేశారు. ఈ చాంబర్‌లలోకి రకరకాల వాసనలు పంపారు. అదే సమయంలో రకరకాల రంగులను ప్రదర్శించి చూశారు. ఎలాంటి వాసన లేనప్పుడు చాంబర్‌లో ఎలాంటి రంగును ప్రదర్శించినా దోమలు పట్టించుకోలేదు. కార్బన్ డై ఆక్సైడ్‌ను పంపాక ఆకుపచ్చ, నీలం, ఊదా రంగులను ప్రదర్శించినా పెద్దగా స్పందించలేదు. కానీ కార్బన్ డై ఆక్సైడ్‌తోపాటు ఎప్పుడైతే ఎరుపు, నారింజ, నలుపు, సియాన్ రంగులను ప్రదర్శించారో ఆ రంగుల వైపు వెళ్లడం గమనించారు. మామూలుగా మనం రోడ్డుపై వెళ్తున్నప్పుడు మంచి బిర్యానీ వాసన వస్తే 'ఎక్కడినుంచబ్బా' అని అటూ ఇటూ చూస్తాం. దోమలు కూడా కార్బన్ డై ఆక్సైడ్ వాసన రాగానే 'వాటి బిర్యానీ' ఎక్కడని చూస్తాయని శాస్త్రవేత్తలు సరదాగా చెప్పారు. శాస్త్రవేత్తలు తమ చేతికి రకరకాల గ్లోవ్స్ వేసుకొని కూడా పరిశీలించారని, అందులోనూ ఎరుపు, నారింజ, నలుపు, సియాన్ రంగు గ్లోవ్స్ వైపు దోమలు ఎక్కువగా వెళ్లాయని.. ఆకుపచ్చ, ఊదా, నీలం, తెలుపు రంగుల గ్లోవ్స్‌ను పట్టించుకోలేదని తెలిపారు. దోమలు వాటి ఆహారాన్ని ఎలా వెతుకుతాయో తెలుసుకోవడానికి ఇది తొలిమెట్టేనని, మనుషుల శరీరం నుంచి వచ్చే వాసనలను ఎలా అవి గుర్తిస్తున్నాయో తెలుసుకోవాల్సి ఉందని చెప్పారు.

## ఆ ఊరే ఓ సైన్యం..

# ఉగ్గిపాలతో పాటు ధైర్యాన్ని నూరి పోస్తూ..





ముగడ(బాడంగి)/విజయనగరం: ఆ గ్రామ తల్లులు తమ పిల్లలకు ఉగ్గిపాలతో పాటు ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. దానినే ఊపిరిగా మారుస్తున్నారు. వీరులుగా తీర్చిదిద్దుతున్నారు. క్రమశిక్షణ అలవాటు చేస్తూ భరతమాత సేవకు సిద్ధం చేస్తున్నారు. యుక్తవయసు రాగానే సరిహద్దులో సేవలందించేందుకు పంపిస్తున్నారు. అందుకే.. ఆ ఊరే ఓ సైన్యంగా మారింది. ధైర్యసాహసాలతో శత్రుదేశ సైనికుల్లో వణుకుపుట్టించే మిలటరీ వీరులకు పుట్టినిల్లుగా మారిన ముగడ గ్రామంపై ఈ వారం 'సాక్షి' సండే స్పెషల్. ఈ గ్రామం పేరుచెబితే ఠక్కున గుర్తొచ్చేది సైనికులే. గ్రామంలో సుమారు 983 కుటుంబాలు నివసిస్తుండగా.. 200 మంది ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, బీఎస్ఎఫ్ దళాల్లో పనిచేస్తున్నారు. నాలుగువేల మంది జనాభా ఉన్న గ్రామంలో రెండువేల మందివరకు విద్యావంతులు ఉన్నారు. గ్రామ యువత క్రమశిక్షణకు మారుపేరు. స్వాతంత్ర్యం వచ్చిన నుంచి గ్రామానికి చెందిన యువకులు సైన్యంలో సేవలందిస్తూ వస్తున్నారు. తల్లులు ధైర్యాన్ని నింపుతూ పిల్లలను పెంచుతుంటే... తండ్రులు దేశ సేవలో తరలించేలా ప్రోత్సహిస్తున్నారు. త్రివిధ దళాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు యువతకు దిశానిర్దేశం చేస్తున్నారు. చిన్నప్పటి నుంచే శారీరక దారుఢ్యం పెంచుకునేలా తర్ఫీదునిస్తున్నారు. రక్షణ దళాల్లో చేరేందుకు అవసరమైన విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు. చైతన్యం నింపుతున్నారు. గ్రామానికి చెందిన దాదాపు 63 మంది త్రివిధ దళాల్లో పనిచేసి ఉద్యోగవిరమణ పొందారు. మరికొందరు కల్నల్, లెఫ్టినెంట్ కల్నల్, సేబేదార్ వంటి కేడర్‌లలో పనిచేస్తున్నారు. స్వర్గీయ చప్ప సూర్యనారాయణ (వైద్యాధికారి)గా పనిచేయగా, స్వర్గీయ కోటస్వామినాయుడు, తెంటు స్వామినాయుడు కల్నల్‌గా సేవలందించారు. ప్రస్తుతం యమాల శ్రీనివాసరావు రాజస్థాన్ కోటిలో సుబేదార్‌గా పనిచేస్తుండగా, చొక్కాపు విజయ్‌కుమార్ అస్సాంలో కెప్టెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మత్సరాము మద్రాస్ ఇంజినీరింగ్ సర్వీస్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు. వైమానికాదళంలో వివిధ క్యాడర్లలో పనిచేసి రిటైర్ అయినవారిలో మత్స మురళీధరరావు, మత్సరాము ఉన్నారు. మత్సరాము కొడుకు వైమానిక దళంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ముగడలో సైనికులు స్వయంగా ఓ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో దినపత్రికలతో పాటు గ్రామ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఈ గ్రంథాలయమే ఉద్యోగాల సాధనకు బాసటగా నిలుస్తోంది. విజ్ఞానం పంచుతోంది. దేశానికే కాదు.. తమ గ్రామానికి సైనికులు సేవలందిస్తున్నారు. వివిధ పర్వదినాల్లో గ్రామానికి చేరకుని పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. సొంత డబ్బులతో రోడ్లు బాగుచేస్తున్నారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తున్నారు. అందుకే...గ్రామం ఎప్పుడు చూసినా పరిశుభ్రంగా కనిపిస్తుంది. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను ఘనంగా జరుపుతారు. దేశభక్తిని ప్రదర్శిస్తారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో మిలటరీలో చేరేందుకు యువకులు భయపడేవారు. అప్పట్లో గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యామల స్వామినాయుడు మిలటరీలో చేరేలా యువతను ప్రోత్సహించారు. సొంత బావమరిది కోట స్వామినాయుడు మిలటరీలో చేరేలా శిక్షణ ఇచ్చారు. ఆయన కల్నల్ స్థాయికి ఎదిగి గ్రామ యువతకు మార్గదర్శకంగా నిలిచారు. సైన్యంలో చేరేలా యువతకు స్ఫూర్తిమంత్రం బోధించారు. అప్పటి నుంచి గ్రామ యువత దేశ సేవకు పునరంకితమవుతూనే ఉంది. ఆర్మీలో చేరడం గర్వంగా ఉంది. వివిధ క్యాడర్లలో పనిచేశాను. ప్రస్తుతం రాజస్తాన్‌లోని కోటలో సుబేదార్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. నా తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా..

చదువులో ప్రోత్సహించారు. వారిచ్చిన నైతిక మద్దతుతోనే సైన్యంలో చేరాను. వైమానిక దళంలో పనిచేయడం నా అదృష్టం దేశరక్షణలో భాగంగా త్రివిధ దళాల్లో ఒకటైన వైమానికదళంలో ఫిట్టర్‌గా, వర్క్‌డ్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాను. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివిన వెంటనే ఎయిర్‌ఫోర్స్‌కు సెలక్టయ్యాను. నా తండ్రి మత్ససూర్యనారాయణ మద్రాస్‌లో డాక్టర్ కోర్స్ చదివారు. ఆయన ప్రోత్సాహంతోనే వైమానిక దళంలో చేరాను. దేశానికి సేవచేసే భాగ్యం కలగడం నా అదృష్టం.

# 2023లో గెలుపు కిక్ 2024లో అసలైన సవాళ్లు

సరిగ్గా కదపడమే కాకుండా ప్రత్యర్థి పార్టీ అడుగుల్ని సమర్థంగా ఉపయోగించుకుని విజయానికి మెట్లు వేసుకున్న వారు విజయవంతం అయ్యారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా రేవంత్ రెడ్డి ఆత్మ విశ్వాసం కోల్పోలేదు. వివిధ పరిణామాలతో క్రమంగా కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతూ పోయింది. చివరికి కౌంటింగ్ వరకూ కాంగ్రెస్ గెలుపు సాధ్యమేనా అని చాలా మంది అనుకున్నారు. కానీ రేవంత్ రెడ్డి షెడ్యూల్ వచ్చిన రోజునే ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం తేదీని ప్రకటించారు. ఆయన కాన్ఫిడెన్స్ చూసి కాంగ్రెస్ నేతలు ఎక్కడా తగ్గలేదు. చివరికి చెప్పిన సమయానికి రెండు రోజుల ముందుగానే సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు.

## రేవంత్‌కు అసలు సవాల్ లోక్ సభ ఎన్నికలు

అయితే అంతటితో విజయం పరిపూర్ణం అయిపోలేదు. అసలు టెస్ట్ 2024 లోక్ సభ ఎన్నికల రూపంలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు లేదా ఏడాది అన్న నమ్మకంతో బీఆర్ఎస్, బీజేపీ ఉన్నాయి. ఆ రెండు కలిసి పని చేస్తాయని చెప్పడానికి ఎలాంటి సందేహం అక్కర్లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో పది సీట్లు కాంగ్రెస్ గెల్చుకుంటే రేవంత్ రెడ్డికి తిరుగు ఉండదు. అదే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిమితమైన సీట్లు సాధిస్తే మాత్రం బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఆపరేషన్ కమల్ చేపట్టడం ఖాయమని అనుకోవచ్చు. గతంలో కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో బీజేపీ చేసిన సైలెంట్ ఆపరేషన్ల గురించి ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు. అయితే రేవంత్ రెడ్డి అన్ని రాజకీయాలు తెలిసిన వ్యక్తి. తన ప్రభుత్వాన్ని ఎలా కాపాడుకోవాలో ఆయనకు తెలియనిదేం కాదు. కానీ లోక్ సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించలేకపోతే ఆయన కూడా చేయగలిగిందేమీ ఉండదు. భట్టి, కోమటిరెడ్డి లాంటి సొంత నేతలు చేసే రాజకీయాల్నే ఎదుర్కోలేరు.

## బీఆర్ఎస్, బీజేపీ వ్యూహాలు కూడా కీలకమే

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనీసం పది సీట్లు సాధించకపోతే గతంలో కర్ణాటకలో జేడీఎస్–కాంగ్రెస్ కూటమిని కూల్చేసినట్లుగా మహారాష్ట్రలో మహా వికాస్ ఆఘాడీ అధికారాన్ని లాగేసుకున్నట్లుగా బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఆపరేషన్ కమల్ పూర్తి చేసే అవకాశం ఉంది. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన ఉత్సాహం తెలంగాణలోనూ కాంగ్రెస్ లోక్ సభ సీట్లు గెల్చుకోలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ నేతల్ని ఆకర్షించడం చాలా సులువు అవుతుందని చెప్పాల్సిన పని లేదు. గతంలో కడియం శ్రీహరి చెప్పిన లెక్క ప్రకారం చూసుకుంటే ఐదారుగురు ఎమ్మెల్యేలు ఫిరాయిస్తే చాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కూలిపోతుంది. బీజేపీ ట్రాక్ రికార్డును పరిశీలిస్తే ఇదేమంత కష్టం కాదని కేసీఆర్‌కుతెలుసు. అయితే ఇక్కడ బీజేపీ వ్యూహంపై కూడా స్పష్టత రాలేదు. బీఆర్ఎస్ పార్టీ ఎంత బలహీనం అయితే తాము అంత బలపడతామని బీజేపీకి తెలుసు. ఇదే విషయం రేవంత్‌కు తెలుసు. అందకే బీజేపీ బలపడకూడదు అనుకుంటే ఆ పార్టీని టార్గెట్ చేయకుండా ఉంటారు. ఆ పార్టీ నంచి ముప్పు ఉందనుకుంటే ఎమ్మెల్యేలను లాగేసుకునే ప్రయత్నం చేస్తారు. బీజేపీ మాత్రం తాను బలపడాలంటే ఖచ్చితంగా బీఆర్ఎస్ బలహీనం కావాలని కోరుకుంటారు. అందుకే 2024 రాజకీయాల్లో వచ్చే పెను మార్పులు పూర్తి స్థాయిలో లోక్ సభలో వచ్చే ఫలితాలపై ఆధారపడి ఉంటాయి. ఫలితాలు ఎలా వచ్చినా ఆ తర్వాత పరిణామాలు మాత్రం పొలిటికల్ సునామీని సృష్టించే అవకాశం ఉంది.

# ఓ వైపు షర్మిల - మరోవైపు విపక్షాల ఐక్యత

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీకి షర్మిల అధ్యక్షురాలు కావడం ఖాయమన్న ప్రచారం కొంత కాలంగా జరుగుతోంది. ఇటీవల ఏపీ కాంగ్రెస్ నేతలందర్నీ పిలిపించుకున్న హైకమాండ్ దాదాపుగా ఇదే సందేశాన్ని ఇచ్చింది. ఇక లాంఛనంగా షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ బాధ్యతలను తీసుకోవడమే మిగిలింది. అప్పుడే షర్మిల వల్ల ఎవరికి నష్టం అన్నదానపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఎవరికి నష్టమో ఆ పార్టీ అగ్రనేతలకు బాగా తెలుసు. అందుకే షర్మిల వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. తాను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి కడప నుంచి పార్లమెంట్ కు పోటీ చేస్తానని సంకేతాలు పంపుతున్నారు. అదే సమయంలో క్రిస్మస్ పండుగకు టీడీపీ ముఖ్య నేతలకు ఎప్పుడూ లేని విధంగా గిఫ్ట్‌లు పంపారు. ఇవన్నీ రాజకీయంగా వ్యూహాత్మకంగా జరుగుతున్న పరిణామాలే. షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి వస్తే. దళిత, మైనార్టీల్లో ఓ పది శాతం మంది కాంగ్రెస్ వైపు మళ్లినా అది ఎవరికి డ్యామేజ్ జరుగుతుందనేదానిపై రాజకీయవర్గాలకు భిన్నాభిప్రాయాలు లేవు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థుల కొరత కూడా ఉండదు. టిక్కెట్ రాదని తెలిసి వైసీపీకి గుడ్ బై చెప్పేసిన మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే తాను షర్మిల వెంట నడుస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరిక ఖాయమని ఆయన నిర్ధారణకు రావడంతోనే ఈ ప్రకటన చేశారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక జగన్మోహన్ రెడ్డి టిక్కెట్లు నిరాకరిస్తున్న వారిలో ఎక్కువ మంది వైసీపీలో ఉండే అవకాశం లేదు. ఎందుకంటే టిక్కెట్లు పొందే నేతలు తమను రాజకీయంగా నిర్వీర్యం చేయాలని అనుకుంటారు. పార్టీని వీడటం తప్ప మరో మార్గం లేదు. వీరందరికీ టీడీపీ, జనసేనల్లో చాన్స్ దొరకదు. కానీ షర్మిల వల్ల కాంగ్రెస్ పార్టీలో చోటు దొరుకుంది. అంటే బలమైన అభ్యర్థుల కొరత కూడా తీరుతుంది. ఇలాంటి వారంతా వైసీపీ క్యాడర్ ను తీసుకుని కాంగ్రెస్ పార్టీకి వెళ్తారు. ఇంచార్జుల్ని మార్చే విషయంలో సీఎం జగన్ ముందు ఈ అతి పెద్ద సమస్య వచ్చి పడింది.

## ఎప్పుడూ లేనంతగా ధిక్కరిస్తున్న నేతలు

వైసీపీ పై సీఎం జగన్‌కు పూర్తి స్థాయిలో పట్టు ఉందని ఎక్కువ మంది నమ్ముతారు. ఆయన చెప్పిందే వేదం అని భావిస్తారు. అదే నిజం కూడా. కానీ అధికారంలో ఉండే ఏ పార్టీ అధ్యక్షుడికైనా ఆ పవర్ ఉంటుంది. ఎన్నికలకు ముందు పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్న ప్రచారం ఉన్నప్పుడు తమ డిమాండ్లపై ఏ మాత్రం తేడా వచ్చినా ధిక్కారం వినిపిస్తారు. అలాంటివి ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. జగన్ తరపున వైఎస్ఆర్‌సీపీ వ్యవహారాలను చక్కబెట్టే టాప్ ఫోర్ నాయకుల్లో ఒకరు అయిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి సోదరుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి చేసిన తిరుగుబాటు దీనికి నిదర్శనం.

ఉత్తరాంధ్ర నుంచి అవకాశం రాని నేతలంతా అదే బాటలో ఉండనున్నారు. చివరికి రాయలసీమ నుంచి కూడా ధిక్కారం వినిపించే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. పెనుమలూరు ఎమ్మెల్యే పార్థసారధి సీఎం జగన్ తనను నమ్మలేదంటూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. రాజకీయ పార్టీల్లో ఒక్క సారి అంటుకుంటే అది దావాలనం అవుతుంది.ఎదురుగా షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఉంటే ఇక కట్టు తెగిపోతుందన్న అంచనాలు వస్తాయి. ఇది వైసీపీ అగ్రనాయకత్వాన్ని వెనక్కి లాగుతున్న రెండో అంశం.

## విపక్షాల ఐక్యతతో మారుతున్న రాజకీయం

టీడీపీ – జనసేన పొత్తులు పెట్టుకోవడంతో ఏపీ రాజకీయ సెంటిమెంట్ చాలా వరకూ మారిపోయింది. పవన్ కల్యాణ్ ను పదే పదే టార్గెట్ చేసి ఆయనను టీడీపీతో కలిసేలా పరిస్థితులు కల్పించింది వైసీపీ నాయకులేనన్న సెటైర్లు ఉన్నాయి. అసలు కలిసిపోయిన తర్వాత దమ్ముంటే ఒంటరిగా పోటీ చేయమనే సవాళ్లను చేస్తున్నారు.

ఇలాంటివి రాజకీయాల్లో వేరే అర్థాలకు కారణం అవుతాయి. ఇప్పుడు బీజేపీ కూడా వైసీపీకి వ్యతిరేక కూటమిలో చేరనుందేన్న ప్రచారం జరుగుతోంది. బీజేపీ వైసీపీ వ్యతిరేక కూటమిలో ఉంటే తమకు ఎంత నష్టం జరుగుతుందో వైసీపీ పెద్దలకు బాగా తెలుసు. గత ఎన్నికల సమయంలో బీజేపీతో పొత్తు లేకపోయినా టీడీపీని ఓడించడానికి బీజేపీ కావాల్సిన సహకారం అందించింది. అందుకే చంద్రబాబు పదవి కాలం ముగియక ముందే ఈసీ ద్వారా ఎల్వీ సుబ్రహ్మణ్యాన్ని సీఎస్‌గా నియమించుకుని రెండు నెలల ముందుగానే పాలనను పరోక్షంగా తమ చేతుల్లోకి తెచ్చుకోగలిగారు. ఈ సారి బీజేపీ టీడీపీ, జనేసన కూటమికి సహకరిస్తే అంత కంటే ఘోరమైన పరిస్థితి వైసీపీకి ఎదురయ్యే అవకాశం ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

## మళ్లీ సీనియర్ నేతలకే టిక్కెట్లు ఖరారు చేస్తున్నట్లుగా సంకేతాలు

ఈ రాజకీయ పరిణామాలన్నింటినీ విశ్లేషించుకున్న వైఎస్ఆర్‌సీపీ పెద్దలు ఇంచార్జులు మార్పు అనే వ్యూహంపై వెనక్కి తగ్గాని నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది. మైలవరం నుంచి వసంత కృష్ణప్రసాద్ ను మార్చేస్తామని ముందుగా నిర్ణయించారు. వేరే చోట నుంచి పోటీ చేయాలని సూచించారు. కానీ ఆయన తాను అసలు పోటీ చేయనని చెప్పి వెళ్లిపోయారు.సీఎంవో పిలిచినా రాలేదు. కానీ మళ్లీ మైలవరంలోనే పోటీ చేసేందుకు చాన్సిస్తామని చెబితేనే వచ్చారు. ఇప్పుడు ఆయనకే టిక్కెట్ ఖరారు చేశారు. అలాగే బాలినేని శ్రీనివాస రెడ్డి, రోజా, అంబటి రాంబాబు సహా కీలక నేతలందరి పేర్లు మార్పు జాబితాలోకి వచ్చినా మళ్లీ తప్పించారు ఇప్పటికే 11 నియోజకవర్గాల్లో నియోజకవర్గాలను మార్చారు.

ఇందులో అటూ ఇటూ తిప్పిన వారు కాకండా నికరంగా ముగ్గురికే టిక్కెట్ నిరాకరించారు. ఇక మహా అయితే మరో పది మందికి మాత్రమే టిక్కెట్ నిరాకరిస్తారని.. సిట్టింగ్‌లకే చాన్సిస్తారని వైసీపీ వర్గాలు ప్రచారం ప్రారంభించాయి. మొత్తంగా కసరత్తు పేరుతో వైసీపీలో చిచ్చు పెట్టుకోవడం తప్ప పెద్దగా మార్పులేమీ ఉండవని వైసీపీ వర్గాలు ఇప్పుడు గట్టిగా నమ్ముతున్నాయి.

# అయోధ్య రాముడి కోసం భజనలు చేయండి

నిద్రపోతారని, ఆయన మానసిక ఆరోగ్యంపై అంతగా దృష్టి పెడతారని ఉదాహరణ చెప్పారు. చంద్రయాన్ 3 విజయం అందరికీ గర్వకారణం అని ప్రశంసించారు. భారత్ ఈ విజయం సాధించినందుకు అందరూ తనకు అభినందనలు తెలుపుతున్నారని, తనలాగే దేశ ప్రజలందరూ సంతోషంతో ఉప్పొంగిపోతున్నారని అన్నారు ప్రధాని. ఈ ఏడాదిలో భారత్ క్రీడారంగంలోనూ దూసుకుపోయిందని ప్రశంసించారు. ఏషియన్ గేమ్స్ లో అథ్లెట్స్ 107 మెడల్స్ సాధించడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. వరల్డ్ కప్ మ్యాచ్‌లలోనూ భారత్ చాలా గొప్పగా రాణించిందని ప్రశంసలు గుప్పించారు. వచ్చే ఏడాది పారిస్‌లో ఒలింపిక్స్ జరగనున్నాయని, వాళ్లందరినీ ప్రోత్సహించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు.

## ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ గురించి ప్రస్తావన..

మన్‌కీ బాత్ ఎపిసోడ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించీ ప్రస్తావించారు. దాదాపు అన్ని రంగాల్లోనూ ఈ సాంకేతికత వినియోగం పెరిగిందని అన్నారు. హిందీ నుంచి తమిళంలోకి అనువదించే ఏఐ భాషిణి యాప్ గురించి మాట్లాడారు. ఇలాంటి సాంకేతికత వల్ల ఎన్నో సవాళ్లను దాటవచ్చని వెల్లడించారు. విద్యారంగంలోనూ ఇది మార్పులు తెస్తుందని ఆకాంక్షించారు. అయోధ్య రామ మందిర నిర్మాణం గురించీ మాట్లాడారు ప్రధాని. జనవరి 22న జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాముడిపై ఉన్న భక్తిని చాటుకునేందుకు కవితలు,పద్యాలతో రామ భజన చేయాలని పిలుపునిచ్చారు.

# జూబ్లీహిల్స్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

మొట్టమొదటిసారిగా బ్రౌన్ షుగర్ డ్రగ్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకోవటం గమనార్హం. 100 గ్రాముల ఎండీఎంఏతో పాటు 26 గ్రాముల కొకైన్, 29 గ్రాముల బ్రౌన్ షుగర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పంజాబ్ నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో అమ్ముతున్న ఇద్దరు విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాబ్‌లోని లవ్లీ యూనివర్సిటీలో చదువుతున్న సూరి లీల నవీన్‌తో పాటు వీర సాయి తేజను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యూ ఇయర్ కోసం పెద్ద మొత్తంలో హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చినట్టు పోలీసులు తెలిపారు. గత నాలుగేళ్లుగా న్యూ ఇయర్ వేడుకలకు ఢిల్లీ, పంజాబ్ నుంచి డ్రగ్స్ తీసుకొస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన నవీన్ పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. లోన్ యాప్‌లలో కూడా రుణాలు తీసుకున్నాడు. కాగా తీసుకున్న అప్పులను తీర్చేందుకు డ్రగ్స్ అమ్ముతున్నట్టు పోలీసుల విచారణలో నవీన్ తెలిపినట్టు సమాచారం. న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో డ్రగ్స్‌పై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇప్పటికే కఠిన ఆంక్షలు విధించిన పోలీసులు మద్యం తాగినవారి కోసం బ్రీత్ అనలైజర్లతో పాటు, డ్రగ్స్ సేవించినవారిని గుర్తించేందుకు ప్రత్యేక పరికరాలు కూడా తెప్పించారు. డ్రగ్స్ తీసుకున్నారన్న అనుమానం వస్తే అక్కడిక్కడే పరీక్షలు నిర్వహించనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుపై వచ్చే వాహనాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

# 'రైతు - మహిళ - యువత నామ సంవత్సరం' గా సంకల్పం

పాలనలో ప్రజలను భాగస్వాములను చేశామన్నారు రేవంత్. ప్రజాస్వామ్య పునరుద్ధరణ, పౌరులకు స్వేచ్ఛ ఉంటుందన్న హామీని నిలబెట్టుకున్నామని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. ఆరింటిలో రెండు గ్యారెంటీలు అమలు చేశామని చెప్పారు. కొత్త ఏడాదిలో మిగతా గ్యారెంటీల అమలుకు సిద్ధంగా ఉన్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం అందాలని ఆకాంక్షించారు. అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన ఉండాలని పేర్కొన్నారు.

## ఇది రైతు - మహిళ - యువత నామ సంవత్సరం..

ఈ నూతన సంవత్సరం 'రైతు – మహిళ – యువత నామ సంవత్సరం' గా తెలంగాణ ప్రభుత్వం సంకల్పం తీసుకున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పాలనలో స్తంభించినపోయిన పాలన వ్యవస్థ సమూల ప్రక్షాళనకు సంకల్పించాం అన్నారు. ప్రజా పాలనకు అనుగుణంగా వ్యవస్థల పునర్ వ్యవస్థీకరణ జరుగుతోందని.. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందన్నారు. ప్రజల గోడు వినేందుకు ప్రజా భవన్ లో ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. కార్యనిర్వాహక వ్యవస్థలో మానవీయత జోడించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

## యువత భవిష్యత్ కు గ్యారెంటీ ఇచ్చే దిశగా ఆలోచన..

'యువత భవిత మాకు ప్రాధాన్యం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతకు అందించి వారి భవిష్యత్ కు గ్యారెంటీ ఇచ్చే దిశగా ఆలోచన చేస్తున్నాం. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు సమూల ప్రక్షాళనకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతుల విషయంలో ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నాం. గత ప్రభుత్వంలో చిన్నాభిన్నమైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిపుష్టం చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. ఆర్థిక, విద్యుత్ రంగాలలో వాస్తవ పరిస్థితులను శ్వేతపత్రాల ద్వారా మీ ముందు ఉంచాం. తర్వలో సాగునీటి రంగంలో జరిగిన అవినీతి పై కూడా శ్వేతపత్రంతో వాస్తవాలు వెల్లడిస్తాం. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకుంటామని, దోపిడీకి గురైన తెలంగాణ ప్రజల సంపదను తిరిగి రాబడతామని మాట ఇచ్చాం. ఆ దిశగా చర్యలు మొదలుపెట్టామని' సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు

'పదేళ్లుగా ఫించన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల కోసం లక్షల మంది అర్హులు ఎదురు చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అతి త్వరలో వారి ఆశలు ఫలిస్తాయి. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయి. అధికారం కోల్పోయిన దుగ్ధ, ఈర్ష్యతో కొందరు అధములు చేసే తప్పుడు ప్రచారాలు, అసత్య ప్రకటనలతో గందరగోళం అవసరం లేదు. ఇది గత పాలన కాదు జన పాలన. ప్రతి పౌరుడు ఈ ప్రభుత్వాన్ని చేరుకునేందుకు 24 గంటలు ద్వారాలు తెరిచే ఉంటాయని' రేవంత్ రెడ్డి వివరించారు.అమరులు, ఉద్యమకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆ కేసుల నుండి విముక్తి కల్పించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఆటో కార్మికులు, అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని తీసుకొచ్చాం జర్నలిస్టుల సంక్షేమం పట్ల మన ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. త్వరలో వాళ్ల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. నా తెలంగాణ కోటి రతనాల వీణగా కోట్లాది ప్రజల సంక్షేమ వాణిగా అభివృద్ధిలో శిఖరాగ్రాన నిలవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి నూతన సంవత్సర ఆకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని ప్రతి గడపన సౌభాగ్యం వెల్లివిరియాలని, ప్రతి ఇంటా వెలుగులు నిండాలని మనసారా ఆకాంక్షించారు.

# ఎన్నికల కోడ్ వస్తే 6 గ్యారెంటీల పరిస్థితేంటి.?

వాటిపై క్లారిటీ ఇవ్వాలని అన్నారు. గైడ్ లైన్స్ లేకుండా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోందని, నిజానికి మొదట గైడ్ లైన్స్ ఎందుకు విడుదల చేయలేదని లదీశారు. ఫిబ్రవరిలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని, ఇబ్బంది రాకూడదంటే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి మూడో వారంలోపు నిబంధనలు రూపొందించి ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అవి ఎగవేత పత్రాలా.?

కాంగ్రెస్ శ్వేతపత్రాలు హామీల ఎగవేత పత్రాలనే అనుమానం కలుగుతోందని హరీష్ రావు విమర్శించారు. ప్రభుత్వం గ్యారెంటీలకు సంబంధించి ఏం చేసినా ఫిబ్రవరి 20లోపే చేయాలన్నారు. రైతు బంధు నిధుల విషయంలో ప్రభుత్వం వైపు నుంచి స్పష్టత లేదని అన్నారు. రైతులు పండించిన ధాన్యానికి బోనస్ ఇస్తామని మరో కీలక హామీని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని, ఖరీఫ్ లో ఎలాగూ ఇవ్వలేదని యాసంగిలోనైనా ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటకు బోనస్ పై ఇప్పుడు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోకుంటే యాసంగిలో రైతులు నష్టపోతారని చెప్పారు. డిసెంబర్ 9 నాడే రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఆసరా పెన్షన్ల పెంపు, 200 యూనిట్ల లోపు విద్యుత్ బకాయిల మాఫీ అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి సభల్లో హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అవి ఇంకా అమలు కాలేదనే ఆందోళనలో ప్రజలు ఉన్నారని చెప్పారు. అసెంబ్లీలో శ్వేతపత్రాలు ఇచ్చిన వారికి రైతు బంధు డబ్బులపై ప్రతి రోజూ ప్రెస్ నోట్ ఇవ్వడంలో ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. ఆరోగ్య శ్రీ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచామన్నారని, అది ఎంత మందికి వర్తించిందో వివరాలివ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ లో రూ.14 వేల కోట్ల అప్పులు తెచ్చుకున్నట్లు తెలిసిందన్నారు. గ్యారెంటీలు ఇచ్చినప్పుడు బడ్జెట్ గురించి కాంగ్రెస్ వాళ్లకు అవగాహన లేదా అని ప్రశ్నించారు. గ్యారెంటీలపై ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయాల్సిందేనని అన్నారు.

## సీఎం స్థాయి వ్యక్తికి సరికాదు

సీఎం స్థాయి వ్యక్తి వాహనాలు దాచిపెట్టడం అని మాట్లాడడం సరి కాదని, ప్రభుత్వం దాచడం ఏం ఉంటుందని ప్రశ్నించారు. బుల్లెట్ ప్రూఫ్ కోసం వాహనాలు ఎవరైనా విజయవాడకు పంపాల్సింది నని, అవి సీఎం వాడుకోరా.?, ప్రభుత్వం వాడుకోదా.? అని నిలదీశారు. పలు ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, నర్సాపూర్, జనగామ, హుజూరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు గౌరవం ఇవ్వకుండా, ఓడిపోయిన కాంగ్రెస్ నేతలకు అధికారులు ఆహ్వానాలు పంపారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల్లోగా కాంగ్రెస్ గ్యారెంటీలకు మార్గదర్శకాలు ఇచ్చి జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఎంజీఎం ప్రక్షాళనపై ఫోకస్

అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెల్త్ సిటీ పేరుతో కొత్తగా నిర్మిస్తున్న ఆస్పత్రి పై ఎంజిఎం అధికారులకు ఎలాంటి ప్రమేయం లేకుంటేనే నిర్మాణం జరుగుతుందని అధికారులతో మంత్రి కొండా సురేఖ అన్నారు. పేషెంట్లు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఆపరేషన్ల కోసం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ వైద్యులు ప్రభుత్వం ఇచ్చిన జీతాలు సరిపోవడం లేదంట్లుగా వ్యవహరిస్తున్నారని.. వారికికి కావాల్సింది డబ్బు మాత్రమే కాదన్నారు. అలాగైతే, యాక్ట్ తీసుకువచ్చి పీజీ పూర్తి చేసిన వారిని రెండు సంవత్సరాలు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఆసుపత్రి ఎలా ఉందో తనకు సంబంధం లేదని ఇప్పటినుండి ఆసుపత్రిలో ప్రతి పేషెంట్‌కు వైద్యం అందించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని మంత్రి కొండా సురేఖ వైద్యశాఖ అధికారులను హెచ్చరించారు. ఎంజీఎం లో కావాల్సిన సౌకర్యాలపై త్వరలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో సమావేశం అవుతానని సురేఖ అన్నారు.

## సీతక్కతో కలిసి ఘనంగా జాతరలు నిర్వహణ

సమ్మక్క సారలమ్మ జాతర సహా సంక్రాంతికి ఐనవోలు, కొమురవెల్లి జాతరల్ని రాష్ట్ర మంత్రులుగా తాను, సీతక్క కలిసి ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. గత ప్రభుత్వంలో ఏమో కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతరల నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హన్మకొండ జిల్లా ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన మంత్రి కొండా సురేఖకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సంక్రాంతి మొదలుకొని ఉగాది వరకు మూడు నెలల పాటు జరిగే బ్రహ్మోత్సవాల నిర్వహణ సమీక్ష సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి పాల్గొన్నారు. మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు.

# పీఎస్ఎల్వీ-సీ 58 కౌంట్ డౌన్ మొదలు

గంటలపాటు ఈ కౌంట్ డౌన్ కొనసాగుతుంది. నేడు ఉదయం 9.10 గంటలకు ప్రయోగం మొదలవుతుంది. పీఎస్ఎల్వీ–సీ 58 వాహకనౌక షార్ లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్తుంది. ఇది ఎక్స్పో సాట్ తోపాటు కేరళ యూనివర్శిటీ విద్యార్థులు రూపొందించిన విఐవై నానోశాట్ ని కూడా ను కక్ష్యలో ప్రవేశపెడుతుంది.

## ఎక్స్పో సాట్ విశేషాలు..

బరువు 418 కిలోలు, జీవితకాలం 5 సంవత్సరాలు, టెలిస్కోప్ లా పనిచేస్తుంది, అంతరిక్ష రహస్యాలను పరిశోధిస్తుంది, బ్లాక్ హోల్స్, పాలపుంతలు, ఎక్స్ రే కిరణాలపై పరిశోధనకి ఉపయోగపడుతుంది.

## ఎక్స్పో సాట్ గురించి మరింత సమాచారం..

ఎక్స్పో సాట్ భారతదేశ అంతరిక్ష ఆధారిత ఎక్స్–రే ఖగోళ శాస్త్రానికి సంబంధించిన సమాచారాన్ని పంపిస్తుంది. ఈ రంగంలో ఇది ఓ సంచలనాత్మక పురోగతికి నాంది పలుకుతుందని అంటున్నారు. ఇమేజింగ్, టైం–డొమైన్ అధ్యయనాలు, స్పెక్ట్రోస్కోపీపై ప్రధానంగా దృష్టి సారిస్తుందని ఇస్రో చెబుతోంది. గతంలో కూడా ఇలాంటి ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించినా ఆ మిషన్ల మాదిరిగా కాకుండా, ఎక్స్–రే ఖగోళ శాస్త్రానికి ఒక కొత్త కోణాన్ని పరిచయం చేస్తుందని అంటున్నారు. ఎక్స్–రే మూలాలను అన్వేషించడం ఎక్స్‌పోశాట్ లక్ష్యంగా పేర్కొన్నారు శాస్త్రవేత్తలు. భూ ఉపరితలానికి 650 కిలోమీటర్ల ఎత్తులో ఈ శాటిలైట్ ని ప్రవేశపెడతారు.

## 60వ ప్రయోగం..

ఇప్పటి వరకు పీఎస్ఎల్వీ ప్రయోగాలు 59 జరిగాయి. ఇందులో 60వ ప్రయోగం జనవరి–1న జరగబోతోంది. ఇప్పటి వరకు పోలార్ శాటిలైట్ లాంచి వెహికల్ ప్రయోగాలు పీఎస్ఎల్వీకి బాగా అచ్చొచ్చాయి. ఈ ఏడాది కూడా మొదటి రోజు పీఎస్ఎల్వీతోనే ప్రయోగాలను ప్రారంభిస్తోంది ఇస్రో. ఇది కూడా విజయవంతమవుతుందనే ధీమా భారత శాస్త్రవేత్తల్లో ఉంది. పీఎస్ఎల్వీ–సీ 58 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం జరుగుతుంది.

# దేశంలో ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న కోవిడ్

కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. దీంతో యాక్టివ్ కేసులు 4,309కు చేరుకున్నాయి. గత 227 రోజుల్లో దేశంలో నమోదైన అత్యధిక కేసులు ఇవే కావడం గమనార్హం.కేరళ, కర్ణాటక, బిహార్‌లో ఒక్కొక్కరు చొప్పున మరణించారని అధికారులు చెప్పారు. డిసెంబరు 5 వరకు దేశంలో రోజువారీ కరోనా కేసుల సంఖ్య రెండంకెలకు మాత్రమే పరిమితమై ఉండేది. అయితే, కొత్త వేరియంట్ జేఎన్.1 వ్యాప్తి, ఆపై శీతాకాలం కావడం వల్ల ప్రస్తుతం డ్ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అధికారులు వెల్లడించారు. ఏదేమైనప్పటికీ ఈ ఏడాది చివరిలో కోవిడ్–19 కేసులు మరోసారి పెరిగాయి. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ్ బెంగాల్, ఒడిశా, రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, బిహార్, పంజాబ్, జమ్మూ అండ్ కశ్మీర్, పుదుచ్చేరిలో కొత్త కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి.దేశంలో ప్రస్తుతం కొత్తరకం వేరియంట్ జేఎన్ 1 కేసుల సంఖ్య 178కి చేరుకున్నాయి. వీటిలో అత్యధికంగా కేరళలో 41, గుజరాత్‌లో 36, కర్ణాటక 34, మహారాష్ట్ర 9, తమిళనాడు, రాజస్థాన్‌లో నాలుగు చొప్పున, తెలంగాణలో రెండు, ఢిల్లీలో ఒక కేసు వచ్చాయి.

# రేషన్ కార్డుపై ప్రభుత్వం కీలక నిర్ణయం

ఈ కేవైసీ ప్రక్రియ కొనసాగుతుంది. తెలంగాణలో దాదాపు 70 శాతం పూర్తి అయిందని అధికారులు చెప్పారు. ఈకేవైసీలో మేడ్చల్ మాల్కజిగిరి జిల్లా 87.8 శాతంతో టాప్ లో ఉంది. ఇంకా ఎవరైనా చేయనివారుంటే జనవరి 31లోపు పూర్తి చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన అనే పథకం ద్వారా అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉచితంగా రేషన్ ఇస్తున్న సంగతి తెలిసిందే.

దేశంలో చాలా వరకు బోగస్ రేషన్ కార్డులు ఉన్నట్లు గురించిన కేంద్రం ఆధార్ నంబర్‌తో లింక్ (ఈ కేవైసీ) చేయాలని కోరుతోంది. ఇందుకు సంబంధించి పలుమార్లు గడువును పొడగించింది. ఈ గడువును తాజాగా మరోసారి పొడగించింది. ఈ కేవైసీ పూర్తి చేసుకోకుంటే రేషన్ కట్ అవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే రేషన్ కార్డుతో ఆధార్ కార్డు సీడింగ్ చేసుకోని ఖాతాదారుల రేషన్ కార్డును నకిలీగా భావించి డిలీట్ చేయనుంది. రేషన్ కార్డులో పేరున్న వారు చాలా మంది చనిపోయారు. వారు చనిపోయినా కూడా వారి పేరుతో రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. మరి కొంత మంది ఆడ వారు పెళ్లై అత్తారింటికి వెళ్లారు. వారి పేరు కూడా రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. రేషన్ కార్డు ఈకేవైసీ చేయడం వల్ల బతికున్న వారే ఈకేవైసీ చేసుకుంటారు. ఈకేవైసీ చేసుకోని వారి పేరును రేషన్ కార్డు నుంచి తొలగించనున్నారు.

# ఉపాధ్యాయులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

## : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

రంగారెడ్డి : తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడూ తెలుసుకొని పరిష్కరిస్తుందని తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. తెలంగాణ టీచర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా శాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో ఉపాధ్యాయుల సహకారం ఉండాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు, టీటీయూ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల బలవంత్‌రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.
సర్వీసు రూల్స్, బదిలీలు, పదోన్నతులు, 317 జీవో బాధితులను వెనక్కి రప్పించడం, నెల నెల జీతాలు ఒకటో తేదీన అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయి బిల్లులు చెల్లించాలని, పండిత్, పీఈటీ అప్‌గ్రేడేషన్, అన్ని ఆసుపత్రుల్లో క్యాష్ లెస్ హెల్త్ కార్డులు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు టి.సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి ఏ.రాఘునందన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఏడాది డబ్బింగ్ మూవీస్ మ్యాజిక్ అదుర్స్..




మన సినిమాలు ఆడొచ్చు ఆడకపోచవచ్చు. అందులో పెద్ద చిత్రమేం లేదు. ఎందుకంటే మన సినిమాలు కాబట్టి ఎప్పుడైనా చూసుకోవచ్చు. కానీ అనువాద సినిమాలు మాత్రం ఎప్పుడో కానీ ఆడవు. కొన్నేళ్లుగా డబ్బింగ్ సినిమాలకు తెలుగులో పెద్దగా టైమ్ కలిసిరావడం లేదు. కానీ అదేంటో మరి.. 2023లో మాత్రం వాటికి గోల్డెన్ టైమ్ వచ్చేసింది. కొన్నేళ్లుగా ఎప్పుడూ లేనంతగా అనువాద సినిమాలు విజయం సాధించాయి. చాలా వరకు తమిళం, మలయాళం సినిమాలు తెలుగులో దుమ్ము లేపాయి. 50 కోట్ల క్లబ్‌లోనూ చేరిపోయాయి. కొందరైతే డబ్బింగ్ సినిమాలతోనే రెండు విజయాలు అందుకున్నారు. మరింతకీ ఏంటా డబ్బింగ్ మ్యాజిక్..?2023 సంక్రాంతి నుంచే అనువాద సినిమాల హవా మొదలైంది. కొన్నేళ్లుగా తమిళంతో పాటు తెలుగులోనూ వరస విజయాలు అందుకుంటున్న విజయ్.. 2023లోనూ అదే మ్యాజిక్ రిపీట్ చేశారు. సంక్రాంతికి చిరంజీవి, బాలయ్య లాంటి మెగా హీరోలతో పోటీ పడి మరీ తన వారసుడు సినిమాతో విజయాన్ని అందుకున్నాడు. దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి వంశీ పైడిపల్లి దర్శకుడు. ఈ సినిమా తెలుగులో రూ.15 కోట్ల షేర్ వసూలు చేసింది.

### బిచ్చగాడు 2:

విజయ్ ఆంటోనీ అనే ఓ నటుడు ఉన్నాడనే సంగతి తెలుగు ఆడియన్స్‌కు తెలిసేలా చేసిన సినిమా బిచ్చగాడు. 2016లో విడుదలైన ఈ చిత్రం సైలెంట్‌గా వచ్చి సంచలనం విజయం సాధించింది. ఏడేళ్ల తర్వాత తన స్వీయ దర్శకత్వంలోనే బిచ్చగాడు 2 చేశాడు ఈయన. ఈ సినిమా తెలుగులో దాదాపు 17 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఎవరూ ఊహించని లాభాలను తీసుకొచ్చింది.

### 2018:

సాధారణంగా మన దగ్గర తమిళ సినిమాలు బాగా ఆడుతుంటాయి కానీ మలయాళ సినిమాలను మాత్రం చూడరు.

కానీ కేరళ వరదల నేపథ్యంలో వచ్చిన 2018 అనే మలయాళ డబ్బింగ్ సినిమా మన దగ్గర కూడా మంచి విజయాన్నే అందుకుంది. బన్నీ వాస్ ఈ సినిమాను విడుదల చేయడంతో రీచ్ బాగా పెరిగింది.

### జైలర్:

చాలా ఏళ్లుగా సరైన హిట్ కోసం చూస్తున్న రజినీకాంత్‌కు జైలర్ ఆ కోరిక తీర్చేసింది. తెలుగులోనే 80 కోట్ల గ్రాస్.. 48 కోట్ల షేర్ వసూలు చేసింది ఈ చిత్రం. నెల్సన్ తెరకెక్కించిన జైలర్ తెలుగులో మొదటి రోజు నుంచే దుమ్ము దులిపేసింది. భోళా శంకర్ ఫ్లాప్ అవ్వడంతో.. హిట్ అనుకున్న జైలర్ కాస్తా బ్లాక్‌బస్టర్ అయి కూర్చుంది.

### లియో:

సంక్రాంతికి వారసుడుగా వచ్చి విజయం అందుకున్న విజయ్.. దసరాకు లియోతో మరో బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. ఈ సినిమా తెలుగు వర్షన్ 50 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. లోకేశ్ కనకరాజ్ తెరకెక్కించిన లియో.. కేవలం హైప్‌తోనే అదిరిపోయే ఓపెనింగ్స్ తెచ్చుకుంది. ఎలా చూసుకున్నా.. 2023లో డబ్బింగ్ సినిమాలకు బాగానే కలిసొచ్చింది. ఇదే ఊపు వచ్చే ఏడాది కూడా కంటిన్యూ అయితే మన సినిమాలపై భారీ ప్రభావం తప్పదు.

ఇదే సమయంలో అజిత్ కుమార్ తెగింపు, మణిరత్నం పొన్నియన్ సెల్వన్ 2, లారెన్స్ చంద్రముఖి 2, జిగర్తాండ డబుల్ ఎక్స్, కార్తి జపాన్ లాంటి సినిమాలు మంచి అంచనాల మధ్య విడుదలై దారుణంగా నిరాశ పరిచాయి. సిద్ధార్థ్ చిన్నా సినిమాకు మాత్రం విమర్శకుల ప్రశంసలు దక్కాయి.

# మహేష్ బాబుకు చుక్కలు చూపిస్తున్న ఆ ఒక్కడు.. ఎవరు?



మహేష్ బాబు ఫోకస్ మొత్తం ఇప్పుడు గుంటూరు కారం సినిమా మీదే ఉంది. త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తైపోయింది. దాంతో దుబాయ్ వెళ్లి హాయిగా యాడ్ షూటింగ్ చేసుకుంటున్నాడు సూపర్ స్టార్. అయితే గుంటూరు కారం సినిమాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు మహేష్ బాబు. ఈయన ముందు సినిమా పెద్దగా ఆడలేదు. భారీ అంచనాల మధ్య వచ్చిన సర్కారు వారి పాట ఆబోవ్ యావరేజ్ దగ్గర ఆగిపోయింది. దాంతో గుంటూరు కారం సినిమాతో కచ్చితంగా సూపర్ హిట్ కొట్టాలని చూస్తున్నాడు మహేష్. సంక్రాంతికి ఎంతమంది పోటీలో ఉన్నా కూడా సూపర్ స్టార్ సినిమాకు జరి బిజినెస్ మాత్రం మరో స్థాయిలో ఉంటుంది. అన్నింట్లోనూ గుంటూరు కారం సినిమాకే అగ్ర తాంబూలం ఇస్తున్నారు డిస్ట్రిబ్యూటర్లు. దానికి తోడు త్రివిక్రమ్ దర్శకత్వంలో ఇప్పటివరకు మహేష్ బాబు చేసిన రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ఆకట్టుకోలేదు. అతడు, ఖలేజా రెండు కల్ట్ క్లాసిక్ సినిమాలు అనిపించుకున్నాయి.. కానీ బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ మాత్రం చేయలేదు. పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్ లాంటి మెగా హీరోలకు ఇండస్ట్రీ హిట్స్ ఇచ్చాడు త్రివిక్రమ్. నితిన్ లాంటి హీరోలకు కూడా కెరీర్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ ఇచ్చాడు. దాంతో మహేష్ బాబుకు కూడా బ్లాక్ బస్టర్ ఇవ్వాలని కలలు కంటున్నాడు మాటల మాంత్రికుడు. దాని కోసమే గుంటూరు కారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు.

ఇదిలా ఉంటే ఈ సినిమాలో మహేష్ బాబు డాన్సుల విషయంలో వెనక్కి తగ్గేదే లేదు అంటున్నాడు. చాలా కాలంగా ఈయన సినిమాలలో డాన్సులు పెద్దగా కనిపించడం లేదు. స్టెప్పులు వేస్తున్నా కూడా ఏదో అలా అలా కానిచ్చేస్తున్నాడు కానీ.. ఒళ్ళు వంచి ఒకప్పట్లా మాత్రం ఇరగదీయడం లేదు సూపర్ స్టార్. సరిలేరు నీకెవరు, సర్కారు వారి పాట సినిమాలలో ఒకటి రెండు పాటల్లో స్టెప్పులు బాగానే వేసినా కూడా పూర్తిగా మాస్ మాత్రం కాదు. ఇక ఇప్పుడు గుంటూరు కారం సినిమాలో ఆ బాకీ మొత్తం తీర్చేస్తున్నాడు మహేష్. తాజాగా విడుదలైన కుర్చీ మడతపెట్టి అనే పాటలో మహేష్ బాబు స్టెప్పులు చూస్తుంటే వారెవా అనకుండా ఉండలేకపోతున్నారు అభిమానులు. ఈ విషయంలో కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ఎక్కువ క్రెడిట్ తీసుకోవాల్సిందే. ఎందుకంటే మహేష్ బాబు సినిమాలకు ఆయన కొరియోగ్రఫీ చేయడం మొదలు పెట్టిన తర్వాతే డాన్సులలో వేగం పెరిగింది. ఇప్పుడు ఈ కుర్చీ మడతపెట్టి పాటలో అయితే మహేష్ స్టెప్స్ మరింత వేగంగా ఉన్నాయి. పైగా పక్కనున్నది శ్రీలీల కావడంతో ఆమెకు మ్యాచ్ అయ్యేలా మహేష్ కూడా రెచ్చిపోయాడు. ఇప్పుడు లిరికల్ సాంగ్ చూస్తుంటేనే ఈ రేంజ్ రెస్పాన్స్ వస్తుంది అంటే.. రేపు థియేటర్లలో పాట చూసేటప్పుడు అభిమానుల గోల ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. మొత్తానికి డాన్సుల విషయంలో మాత్రం మహేష్ బాబును బాగా ఇబ్బంది పెడుతున్నాడు శేఖర్ మాస్టర్. గతంలో లేనంతగా ఆయనతో స్టెప్పులు వేయిస్తున్నాడు.

# మృణాల్ శ్రీరామరక్ష



'సీతారామం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది మరాఠీ భామ మృణాల్ ఠాకూర్. ఇటీవల విడుదలైన 'హాయ్ నాన్న' సినిమాలో ఆమె అభినయానికి చక్కటి ప్రశంసలు దక్కాయి. ఈ నేపథ్యంలో ఈ భామ సినిమాల వేగాన్ని పెంచింది. భారీ అవకాశాలను సొంతం చేసుకుంటూ దూసుకుపోతున్నది. తాజా సమాచారం ప్రకారం రాఘవ లారెన్స్‌తో ఈ అమ్మడు జోడీ కట్టబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. రాఘవ లారెన్స్ హీరోగా దర్శకుడు రమేష్‌వర్మ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇందులో కథానాయిక పాత్రకు చక్కటి ప్రాధాన్యత ఉంటుందని తెలిసింది. బలమైన సంఘుర్షణతో కూడిన ఈ పాత్ర కోసం మృణాల్ ఠాకూర్‌ను ఎంపిక చేశారని తెలిసింది. ఈ చిత్రానికి 'శ్రీరామరక్ష' అనే పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ తెలుగులో విజయ్ దేవరకొండ సరసన 'ఫ్యామిలీ స్టార్' అనే చిత్రంలో నటిస్తున్నది. హిందీలో 'పూజా మేరీ జాన్' అనే సినిమా చేస్తున్నది.

# అసలు ఇంతదూరం ఎలా వచ్చానో.. వైరల్ అవుతున్న రష్మిక పోస్ట్



రష్మిక అంటే వెలుగు రేఖ అని అర్థం. తన పేరు మాదిరిగానే ఈ కన్నడ కస్తూరి ప్రభ దేశమంతా వెలిగిపోతున్నది. పశ్చిమ కనుమల్లో కొలువైన సుందర కూర్గ్ ప్రాంతం నుంచి ఏడేళ్ల క్రితం ఎన్నో కలలతో రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఈ భామ తారాపథంలో దూసుకెళ్లిన వైనం నిజంగా స్ఫూర్తిదాయకమే. యువతరం ఈ అమ్మడిని నేషనల్ క్రష్ అంటూ అభివర్ణిస్తారు. 'పుష్ప'లో శ్రీవల్లిగా, ఇటీవల విడుదలైన 'యానిమల్'లో గీతాంజలి పాత్ర ద్వారా జాతీయ స్థాయిలో ఈ భామ తిరుగులేని గుర్తింపును సంపాదించుకుంది. ప్రస్తుతం దక్షిణాదితో పాటు హిందీలో అగ్ర హీరోలతో జోడీ కడుతున్నది. శనివారంతో ఈ సొగసరి సినీ రంగంలో ఏడేండ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. 'వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ ప్రయాణమంతా ఓ కలలా అనిపిస్తుంది. అసలు ఇంతదూరం ఎలా వచ్చానోనని ఆశ్చర్యం కలుగుతుంది. ఏదిఏమైనా నా కల నెరవేరినందుకు ఆనందంగా ఉంది. మంచి మనసున్న వ్యక్తుల పరిచయం..వారితో చేసిన ప్రయాణం వల్లే ఈ స్థాయికి చేరుకున్నా' అని రష్మిక మందన్న పేర్కొంది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నది. రష్మిక మందన్న 'పుష్ప-2' షూటింగ్‌లో బిజీగా ఉంది.


# తుపాకీ పేల్చినావే తింగరి చిట్టీ..

మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కించిన 'గుంటూరు కారం' చిత్రం సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం



తెలిసిందే. అతడు, ఖలేజా వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల తర్వాత మహేష్‌బాబు-త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. శనివారం 'కుర్చీ మడతపెట్టి' అనే గీతాన్ని విడుదల చేశారు. హుషారెత్తించే మాస్ బీట్‌తో ఈ పాటను తీర్చిదిద్దారు. 'రాజమండ్రి రాగమంజరి..మాయమ్మ పేరు తెల్వనోళ్లు లేరు మేస్త్రీ..సోకులాడి స్వప్నసుందరి..తూనీగా నడుములోన తూటా పెట్టి తుపాకీ పేల్చినావే తింగరి చిట్టి' అంటూ జానపద శైలిలో ఈ గీతం సాగింది. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటకు తమన్ స్వరాల్ని సమకూర్చారు. ఈ పాటలో మహేష్‌బాబు-శ్రీలీల వేసిన స్టెప్పులు ఎనర్జిటిక్‌గా అనిపించాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

# సెన్సార్ పూర్తి చేసుకున్న వెంకటేష్ 'సైంధవ్'.. రన్‌టైం ఎంతంటే.?




టాలీవుడ్ స్టార్ హీరో వెంకటేశ్ నటిస్తున్న తాజా చిత్రం సైంధవ్ యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'హిట్' ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నాడు. వెంకట్ బోయనపల్లి నిర్మాత. వెంకటేష్ నటిస్తున్న 75వ చిత్రమిది కావడం విశేషం. ఆయన కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో భారీ యాక్షన్ హంగులతో రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు, టీజర్ విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీ 2024 సంక్రాంతి కానుకగా జనవరి 13న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమా సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకు U/A సర్టిఫికెట్ అందించారు. 2 గంటల 15 నిమిషాల రన్‌టైమ్‌తో ఈ సినిమా వస్తోంది. ఈ విషయాన్ని చిత్రబృందం సామజిక వేదికల్లో ప్రకటించింది. ఈ పాన్ ఇండియా మూవీని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి భారీ స్థాయిలో నిర్మిస్తుండగా, సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నాడు. చంద్రప్రస్థ ఫిక్షనల్ పోర్ట్ ఏరియా బ్యాక్‌డ్రాప్ మిషన్ నేపథ్యంలో సాగుతున్న ఈ మూవీలో జెర్సీ ఫేం శ్రద్ధా శ్రీనాథ్ కథనాయికగా నటిస్తోంది. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ ఈ మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం విశేషం.

# బీఆర్ఎస్ ఫ్లెక్సీలు పదిలం

# కాంగ్రెస్ ఫ్లెక్సీలు ధ్వంసం

- సనత్ నగర్ నియోజకవర్గంలో ఫ్లెక్సీల రాజకీయం
- కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కోట నీలిమ ఎదుగుదలను తట్టుకోలేక ఫ్లెక్సీల చింపడం
- కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకే అధికారుల వత్తాసు
- కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను చింపడం రాజకీయ కక్ష లేక బీఆర్ఎస్ పార్టీ ఆధిపత్యమా.?
- సనత్ నగర్ లో రౌడీ రాజకీయం నడుస్తుందా.?





**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్)** సనత్ నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధిపత్యం కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలిమ ను రాజకీయంగా ఎదగకుండా భారీ కుట్ర జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా సనత్ నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నేతల మాటే చెల్లుబాటు అవుతుందని అధికారులు బీఆర్ఎస్ నేతల మాటలు కాదని కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు వినడం లేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక కొంతమంది నాయకులు, దుండగులు కలిసి ఇంచార్జ్ కోట నీలిమ ఫోటో ఉన్న ఫ్లెక్సీలను చింపి వేయడం జరిగిందంటే కోట నీలిమ రాజకీయంగా ఎదుగుతే రానున్న రోజుల్లో సనత్ నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఎదురు దెబ్బ తగులుతుందన్న ఆలోచనతో ఆదిలోనే కోట నీలిమను ఎదగకుండా చేసే విధంగా కుట్రలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా కూడా ప్రభుత్వ అధికారులు సనత్ నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలను లెక్క చేయకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తలసాని శ్రీనివాస్ యాదవ్ కు గట్టి పోటీ ఇచ్చిన నీలిమ ఎదుగుదలను ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ నాయకులు నీచమైన కుట్రలు పన్నుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కుట్రను పసికట్టలేకపోతున్నారని నీలిమ ఫోటోతో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను చింపడం అంటే సనత్ నగర్ లో ఎంతటి నీచమైన రాజకీయ కుట్రలకు కొంతమంది నాయకులు పాల్పడడం సిగ్గు చేటని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ నాయకుడు తన ఓవరాక్షన్ తో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎదురు వెళుతున్నారని తనకు ఎదురులేదని చూపించుకోవడానికి తన నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట నీలిమ ఫోటోతో ఉన్న ఫ్లెక్సీలను చింపించి వేయడంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలని కలలు కంటున్నారని, ఆ కలలను తిప్పి కొట్టడానికి గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ నాయకులు ఎలాంటి చతురతను ఉపయోగిస్తారో వేచి చూడాలి.

# ఇండియన్ ఎంబసీలపై దాడుల కేసు

## - 43 మంది అనుమానితులను గుర్తించిన ఎన్ఐఏ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలపై ఇటీవల వరుసగా దాడులు జరిగిన ఘటనలో పురోగతి సాధించింది జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ). అమెరికా, బ్రిటన్, కెనడాల్లోని భారత దౌత్య కార్యాలయాలపై జరిగిన దాడులపై ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ దాడులకు పాల్పడినట్లు భావిస్తోన్న 43 మంది అనుమానితులను గుర్తించినట్లు తెలిసింది. కెనడా, బ్రిటన్, అమెరికాలో ఉన్న భారత ఎంబసీలపై ఈ దాడులు జరిగాయి. లండన్‌లోని భారత రాయబార కార్యాలయం ముందు నిరసనకు దిగిన ఖలిస్థానీ మద్దతుదారులు అక్కడ దాడులకు తెగబడ్డారు. మార్చి 19న ఈ ఘటన జరిగింది. జాతీయ పతాకాన్ని అగౌరపరిచే ప్రయత్నం చేశారు. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని విడుదల చేసిన ఎన్ఐఏ నిందితులను గుర్తించాలని పౌరులను కోరింది. కాగా, జులై 2న అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఎంబసీ ముందు ఈ తరహా దాడి జరిగింది. ఈ రెండు దాడులకు సంబంధించి దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ నేరపూరిత అతిక్రమణ, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, రాయబార సిబ్బందికి ముప్పు కలిగించడం వంటి అభియోగాలను మోపింది. దర్యాప్తులో భాగంగా ఆగస్టు 2023లో ఎన్ఐఏ టీం శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళ్లింది. మరోవైపు, కెనడాలోనూ భారత్ హైకమిషన్ ముందు నిరసన చేపట్టిన సమయంలోనూ హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. పేలుడు పదార్థాన్ని విసిరారు. వరుస ఘటనల నేపథ్యంలో భారత హోంశాఖ ఆదేశాలతో వీటిపై ఎన్ఐఏ దర్యాప్తు ప్రారంభించింది. వీటికి సంబంధించిన మనదేశంలో దాదాపు 50 చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా 43 మంది ఖలిస్థానీ మద్దతుదారులైన అనుమానితులను గుర్తించినట్లు సమాచారం.

# గోదావరి టీడీపీ సీనియర్లకు సీట్లు గల్లంతే

## - పవన్ లిస్టు రెడీ

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో ఎవరు అధికారంలోకి రావాలన్నా గోదావరి జిల్లాల్లో సీట్లు కీలకం. ఈ సారి గోదావరి జిల్లాల్లో తన సత్తా చాటాలనేది పవన్ లక్ష్యంగా స్పష్టం అవుతోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో మెజార్టీ సీట్లలో తన పార్టీ అభ్యర్దులను బరిలోకి దింపేందుకు పవన్ సిద్దమయ్యారు. ఇప్పటికే 15 సీట్లు తమకు కేటాయించాలని జాబితా రెడీ చేసారు. దీంతో, టీడీపీ సీనియర్లకు పవన్ నిర్ణయాలు టెన్షన్ పెంచుతున్నాయి. పవన్ జాబితా పైన ఉత్కంఠ పెరుగుతోంది.

### గోదావరి రాజకీయం

ఉభయ గోదావరి జిల్లాల్లో ఎవరు మెజార్టీ సీట్లు సాధిస్తే ఆ పార్టీకే అధికారం దక్కనుంది. గోదావరి జిల్లాల్లోని మొత్తం 34 స్థానాల్లో పవన్ తన అభ్యర్దులను ఎక్కడెక్కడ బరిలోకి దింపాలనే దాని పైన కసరత్తు వేగం పెంచారు. కాకినాడ కేంద్రంగా మూడు రోజుల పాటు నియోజకవర్గాల ఇంఛార్జ్ లతో సమీక్షలు చేసారు. కాకినాడ సిటీలో ఈ సారి గెలుపు పవన్ కు ప్రతిష్ఠాత్మకంగా మారనుంది. కాకినాడ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డిని గెలవనీయనని పవన్ శపథం చేసారు. ఈ సారి అవసరమైతే తాను కాకినాడ నుంచి బరిలో నిలచే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. కాకినాడలో క్షేత్ర స్థాయిలో కమిటీల ఏర్పాటు, సంస్థాగతంగా బాధ్యతల కేటాయింపులో నిర్లక్ష్యం పైన స్థానికుల నాయకత్వం పై పవన్ ఆగ్రహం వ్యక్తం చేసారు.

### 15 స్థానాలపై పవన్ గురి



ఇక, ఉభయ గోదావరి జిల్లాల్లో 15 స్థానాలు తమకు ఇవ్వాలని ఇతర జిల్లాల్లో అవకాశం మేర సర్దుబాటు చేయాలని మొత్తం 40 సీట్లు తగ్గటానికి లేదని పవన్ చెబుతున్నట్లుగా తెలుస్తోంది. టీడీపీ 40 సీట్లు ఇస్తుందని పార్టీ నేతలతో చెబుతున్నట్లు సమాచారం. ప్రధానంగా కాకినాడ, నర్సాపురం పార్లమెంట్ పరిధిలోని మెజార్టీ సీట్ల జనసేన కోరుతోంది. కాకినాడ , మచిలీపట్నం లోక్ సభ స్థానాలు జనసేనకు కేటాయించే ఛాన్స్ ఉంది. కాకినాడ అభ్యర్ధిని సైతం పవన్ ఖరారు చేసినట్లు చెబుతున్నారు. ఇప్పుడు ఉభయ గోదావరి జిల్లాల్లో 15 స్థానాలు కోరుతుండటంతో టీడీపీ సీనియర్లలో టెన్షన్ మొదలైంది. తాజాగా గోదావరి టీడీపీ నేతలు పవన్ తో సమావేశమయ్యారు. అందులోనూ ఎవరికి సీట్లు వచ్చినా రెండు పార్టీలు సమన్వయంతో పని చేయాలని పవన్ సూచించారు. పొత్తు తమకు కలిసి వస్తుందని అంచనా వేసిన టీడీపీ నేతలకు ఇప్పుడు ఆ పొత్తుతో అసలు సీట్లే కోల్పోయే పరిస్థితి మింగుడు పడటం లేదు.

### ఎవరికి ఏ సీట్లు దక్కేను

దీంతో, తమ పార్టీలో పరిణామాల కంటే జనసేన ఏ స్థానాలు కోరుతుందనేది తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా వైసీపీ నుంచి బయటకు వస్తున్న నేతలు టీడీపీ కంటే జనసేన లో చేరేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో పాటుగా గోదావరి జిల్లాల్లో టీడీపీ కంటే జనసేన ఓటింగ్ శాతం ఎక్కువగా ఉన్నట్లు తాజా సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో పవన్ పట్టు బిగిస్తున్నారు.

పిఠాపురం, రాజోలు, అమలాపురం, కొత్తపేట, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, రాజమండ్రి రూరల్, భీమవరం, తణుకు, తాడేపల్లి గూడెం, నర్సాపురం, ఏలూరు వంటి సీట్లు ఉన్నట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో ఏ నియోజకవర్గాల్లో ఎక్కవ ఓట్లు వచ్చాయో వాటిని తిరిగి పొత్తులో దక్కించకోవాలనేది వ్యూహంగా తెలుస్తోంది. దీంతో...పొత్తులో ఎవరికి ఏ స్థానం దక్కుతుందనే ఉత్కంఠ ఇప్పుడు టీడీపీ సీనియర్లలో పెరిగిపోతోంది.

# పార్టీలకు జీవన్మరణ సమస్యగా

# పార్లమెంట్ ఎన్నికలు

- పార్లమెంట్ ఎన్నికలపై ప్రధాన పార్టీల నజర్
- అసెంబ్లీ ఎన్నికల ఊపును అదే విధంగా కొనసాగించాలని లక్ష్యంతో కాంగ్రెస్
- రాష్ట్రంలో ప్రణాళికా బద్దంగా రాణించాలని కమళనాథుల వ్యూహాలు
- బీఆర్ఎస్ కు జీవన్మరణ సమస్యగా మారిన పార్లమెంట్ ఎన్నికలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆరు గ్యారంటీల హామీతో కాంగ్రెస్ తెలంగాణలో తన మొదటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి శక్తివంతంగా ఉన్న బీఆర్ఎస్‌ని మట్టికరిపించింది అయితే 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అదే జోరు కొనసాగించేలా ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తన పనిని ప్రారంభించారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఆకట్టుకోలేక పోయినను తెలంగాణలో దక్కిన విజయం దక్షిణాది విజయానికి రూపశిల్పిగా మారింది. ఈ క్రమంలోనే తెలంగాణలోని 17 సెగ్మెంట్లలో వీలైనన్ని ఎక్కువ లోక్‌సభ స్థానాలు దక్కేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది.
అలాగే వచ్చే లోక్‌సభ ఎన్నికలు కేసీఅర్ నేతృత్వంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), బీజేపి లకు కూడా అంతే కీలకంగా మారాయి. 2023లో జరిగిన నష్టాన్ని వెనక్కి నెట్టాలని బీఅర్ఎస్ ప్రయత్నిస్తుండగా, దక్షిణాదిలో మెరుగైన ప్రదర్శనను ప్రదర్శించే ప్రణాళికలలో భాగంగా రాష్ట్రంలో బీజేపీ మరింత రాణించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్, (అప్పుడు టీఆర్ఎస్) 9 సీట్లు, బీజేపీ నాలుగు, కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ మిత్రపక్షం ఏఐఎంఐఎం ఒక సీటు గెలుచుకుంది. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన వెంటనే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరు ఎన్నికల హామీల్లో భాగమైన పేదలకు రూ. 10 లక్షల కవరేజీతో కూడిన ఆరోగ్య పథకాన్ని అమలు చేసి ముందుకు దూసుకుపోతు భారీ ఆర్థిక వ్యయాలతో కూడిన ఇతర గ్యారంటీల అమలు చేయాల్సిన భారమైన పనిని కొత్త సంవత్సరంలో ప్రారంభించనుందని సమాచారం. నవంబర్ 30 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రెండు ఉప ఎన్నికలు, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో గెలిచిన తరువాత ఒక సమయంలో బీఆర్ఎస్‌కు ప్రధాన సవాలుగా ఎదిగిన బీజేపీ, దాని ఓట్ల వాటాను దాదాపు 14 శాతానికి రెట్టింపు చేసింది. తాజాగా 119 మంది సభ్యుల సభలో 8 సీట్లు గెలుచుకుంది. డిసెంబర్ 28న తెలంగాణలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కనీసం 10 సీట్లు గెలవాలని, 35 శాతం ఓట్లను సాధించాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నారు.కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్‌కు, లోక్‌సభ ఎన్నికలు చీకటి నుండి బయటపడటానికి, అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత లెక్కలో ఉండటానికి కీలకంగా మారాయి. తెలంగాణా దాటి పార్టీ అడుగుజాడలను విస్తరించేందుకు కేసీఆర్ 2022లో టీఆర్ఎస్‌కు బీఆర్ఎస్‌గా నామకరణం చేశారు, అయితే అసెంబ్లీ ఎన్నికలలో వైఫల్యం అతని ప్రణాళికలు పట్టాలు తప్పింది. మరి త్వరలోనే జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరి సత్తేందో తేలనుంది.












Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588